RNI NO:TELTEL/2022/81794

# వాస్తవ తెలంగాణ

VASTHAVA TELANGANA DAILY

నిజం మా నైజం




PUBLISHED FROM: TELANGANA & ANDHRAPRADESH

www.vasthavatelangana.com | ఎడిటర్ : చింతల రామకృష్ణ సంపుటి : 13 సంచిక : 113 శనివారం, ఆగష్టు 16, 2025 , పేజీలు - 8 వెల : 3/-

## ఆర్ఎస్ఎస్ ప్రపంచంలోనే అతి పెద్ద ఎన్‌జీవో

# వందేళ్ల సందర్భంగా ప్రధాని మోదీ ప్రశంసలు.

**న్యూ ఢిల్లీ :** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రభుత్వేతర సంస్థ అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కొనియాడారు. ఆర్ఎస్ఎస్ వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రధాని మోదీ అభినందనలు తెలియజేశారు. భారతీయ జనతా పార్టీ సైద్ధాంతిక మాతృ సంస్థ అయిన ఆర్ఎస్ఎస్‌ను కొనియాడారు. దేశం నిర్మాణంలో ఆర్ఎస్ఎస్ బలమైన భూమిక పోషించిందన్నారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతిని ఉద్దేశించి ప్రసంగిస్తూ ఆర్ఎస్ఎస్‌ను ప్రధానమంత్రి అభినందించారు. 'ఆర్ఎస్ఎస్ 100 సంవత్సరాల క్రితం ఏర్పడింది. జాతి నిర్మాణంలో ఆర్ఎస్ఎస్ పాలుపంచుకుంది. ఆర్ఎస్ఎస్ భారతదేశ సేవకు అంకితం అయింది. ఆర్ఎస్ఎస్ ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్జీఓ. ఆర్ఎస్ఎస్ చరిత్ర పట్ల నాకు గర్వంగా ఉంది' అని ప్రధాని



మోదీ అన్నారు. ఇక, భువనేశ్వర్‌లోని ఆర్ఎస్ఎస్ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ప్రసంగించారు 100 'మన పూర్వీకుల అత్యున్నత త్యాగాల కారణంగానే భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి, ఆత్మవిశ్వాసం నింపడానికి, గొడవల్లో మునిగి ఉన్న ప్రపంచానికి మార్గనిర్దేశం చేసే విశ్వ గురువుగా ఉద్భవించడానికి మనం ఎంతో కష్టపడి పనిచేయాలి. కేవలం స్వాతంత్ర్యం సాధించుకోవడంతోనే మనం సంతృప్తి చెందకూడద'ని మోహన్ భగవత్ అన్నారు. ఆర్ఎస్ఎస్ స్థాపించి 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆగస్టు 26 నుంచి మెగా వేడుకలు నిర్వహించబోతున్నారు. ఈనెల 26 నుంచి 28 వరకు ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఈ వేడుకలు జరగబోతున్నాయి.

## ఎర్రకోటకు వెళ్లని రాహుల్, ఖర్గే

# కారణం ఇదేనా

**న్యూ ఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోటలో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగా యి. భారత ప్రధాని నరేంద్ర మోదీ ఎర్రకోటపై భారత జాతీయ జెండా ఎగర వేశారు. ఈ కార్యక్రమంలో అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన పలువురు నేతలు పాలో న్నారు. అయితే, కాంగ్రెస్ కీలక నేతలు రాహుల్ గాంధీ, మల్లిఖార్జున్ ఖర్గేలు మాత్రం ఎర్రకోటకు వెళ్లలేదు. వీరు ఎర్రకోటలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనకపోవటంపై పలు పుకార్లు షికార్లు చేస్తున్నాయి. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. సీటింగ్ సదుపాయాలు సరిగా ఉండవన్న కారణంతోటే ఈ ఇద్దరూ ఎర్రకోటకు వెళ్లలేదని తెలుస్తోంది. గత సంవత్సరం అనుభవాల దృష్ట్యా.. ఈ సంవత్సరం ఎర్రకోటకు వెళ్లటం మానుకున్నారని సమాచారం. అయితే, రాహుల్, ఖర్గేలు ఎర్రకోటకు ఎందుకు వెళ్లలేదన్నా దానిపై కాంగ్రెస్ పార్టీనుంచి ఎటువంటి అధికారిక ప్రకటన లేదు. ఇక, ఈ ఇద్దరు సోషల్ మీడియా వేదికగా దేశ ప్రజలకు 79వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. రాహుల్ తన పోస్టులో.. 'ఈ స్వేచ్ఛ మన స్వాతంత్ర్య



సమర యోధుల త్యాగాల ఫలితం. ఇది స్వాతంత్ర్యం మాత్రమే కాదు.. నిజాయితీ, సమానత అనే పునాదిపై న్యాయం నిలిచేలా.. అద్భుతమైన భారత్‌ను నిర్మించాలనే సంకల్పం కూడా. ప్రతీ హృదయం గౌరవంతో, సోదరభావంతో నిండి ఉండాలి. ఈ అమూల్యమైన వారసత్వ గౌరవాన్ని కాపాడటం మనందరి కర్తవ్యం. జై హింద్, జై భారత్' అని పేర్కొన్నారు. ఖర్గే తన పోస్టులో.. 'మన ప్రజాస్వామ్యం ప్రతిష్టాత్మకంగా భావించే స్వేచ్ఛ, న్యాయం, సమానత్వం, సౌభ్రాతృత్వ విలువలకు మనల్ని మనం తిరిగి అంకితం చేసుకోవడానికి స్వాతంత్ర్య దినోత్సవం ఒక పవిత్ర సందర్భం' అని రాసుకొచ్చారు.

# మహనీయుల స్ఫూర్తితో అభివృద్ధి : రేవంత్

**హైదరాబాద్ :** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్? రెడ్డి గోల్కొండ కోటపై జాతీయ జెండాను ఎగుర వేశారు. భారత ప్రజలకు 79వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం తమ జీవితాలు త్యాగం చేసిన మహనీయులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్లు తెలిపారు. గాంధీజీ సారథ్యంలో సాగిన భారత స్వాతంత్ర్య పోరాటం ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రపంచ నగరాలతో పోటీ పడే నిర్ణయాలతో తెలంగాణను ముందుకు తీసుకువెళుతున్నామని అన్నారు. అహింసా పద్ధతిలో మహా సంగ్రామాన్ని గెలిచామన్న సీఎం, స్వాతంత్ర్య పోరాటంలో ప్రపంచానికి సరికొత్త మార్గం చూపించామని పేర్కొన్నారు. 1947 ఆగస్టు 15న మాజీ ప్రధాని నెహ్రూచేసిన ప్రసంగం దేశం మొత్తాన్ని ఏకం చేసిందని, దేశ భవిష్యత్ మనల్ని పిలుస్తోందని నెహ్రూ చేసిన ప్రసంగం చిరస్మరణీయం అని గుర్తు చేశారు. మహనీయుల స్ఫూర్తితో తెలంగాణను అగ్రపథంలో నిలిపేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. నేడు ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్నామని, ఆనాడు పెద్దలు వేసిన పునాదులతోనే నేడు దేశం సుసంపన్నంగా ఉందని ఆకాంక్షించారు. సాహసోపేత నిర్ణయాలతో. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంసాహసోపేత నిర్ణయాలతో సాగుతోందని సీఎం రేవంత్? రెడ్డి అన్నారు. మరోవైపు పేదల సంక్షేమంలో సరికొత్త చరిత్ర రాస్తున్నామని, సంక్షేమానికి కేరాఫ్ అంటే కాంగ్రెస్ పాలన అని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలో ఎక్కడాలేని విధంగా 3.10 కోట్ల మందికి సన్నబియ్యం ఇస్తున్నామని, సన్నబియ్యం పథకం కేవలం ఆకలితీర్చే పథకం కాదని పేర్కొన్నారు. సన్నబియ్యం పథకం పేదల ఆత్మగౌరవానికి ప్రతీక అని రేవంత్? రెడ్డి చెప్పారు. ప్రజాప్రభుత్వం వచ్చాకే పేదల సమస్యలు పరిష్కారం అవుతున్నాయన్న సీఎం రేషన్ షాపులు పేదవాడి ఆకలి తీర్చే భరోసా కేంద్రాలుగా మారాయని తెలిపారు. రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం..గతేడాది ఆగస్టు 15న రూ.2 లక్షల రుణమాఫీకి శ్రీకారం చుట్టామని, రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకుని సగర్వంగా నిలబడ్డామని సీఎం రేవంత్? రెడ్డి అన్నారు. విత్తనాలు వేసేనాటికే రైతుల ఖాతాల్లో రైతుభరోసా ఇచ్చామని, పరిమితులు లేకుండా 9 రోజుల్లోనే రైతుల ఖాతాల్లో రూ.9 వేల కోట్లు వేశామని తెలిపారు. రైతు పండించిన చివరిగింజ వరకు ధాన్యం సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో 78 లక్షల వ్యవసాయ మోటార్లకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామన్న సీఎం ప్రభుత్వం అండగా నిలవడంతో రైతులు రాష్ట్రాన్ని అన్న పూర్ణగా నిలిపారని తెలిపారు. కాళేశ్వరం నుంచి నీరు రాకపోయినా :కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి చుక్కనీరు రాకపోయినా ధాన్యం దిగుబడిలో రికార్డు సాధించామని సగర్వంగా చెప్పారు. శ్రీశైలం, నాగార్జునసాగర్, శ్రీరామ్‌సాగర్, కోయిల్‌సాగర్‌తో వరి పండిస్తున్నట్లు తెలిపారు. పేదల సొంతింటి కల ఇందిరమ్మ ఇళ్లతో నెరవేరుస్తున్నామని, గత ప్రభుత్వం పదేళ్లపాటు వారికి సొంతింటి కలను దూరం చేసిందని సీఎం రేవంత్? రెడ్డి దుయ్యబట్టారు. నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేసి పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నట్లు తెలిపారు. మధ్యవర్తులు లేకుండా పేదరికమే ప్రామాణికంగా లబ్ధిదారుల ఎంపిక జరిగిందని అన్నారు. బీసీ బిల్లులు ఆమోదించండిసామాజిక న్యాయం కాంగ్రెస్ పార్టీ డీఎన్ఏలోనే ఉందని, సామాజిక కుల, ఆర్థిక, రాజకీయ, విద్య సర్వేను ఒక యజ్ఞంలా చేశామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. సామాజిక సర్వే చేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని చేశామని, మార్చి 2న బిల్లులు తెచ్చామని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పంపిన బీసీ బిల్లులను త్వరగా ఆమోదించాలని గోల్కొండ కోటపై నుంచి మరోసారి విజ్ఞప్తి చేస్తున్నట్లు రేవంత్? ఆలోచిస్తామని, నెహ్రూ నిర్మించిన సాగర్, శ్రీశైలం, శ్రీరామ్ సాగర్‌తోనే మనకు నీళ్లు అందుతున్నాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వం కాళేశ్వరం పేరుతో రూ.లక్ష కోట్లను గోదావరిలో పోసిందని దుయ్యబట్టారు. రూ.లక్ష కోట్లు వృథా చేసి ఇప్పుడు మళ్లీ సెంటిమెంట్ రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గోదావరి, కృష్ణా జలాల్లో మన వాటాను వదులుకోవటం జరగదని తేల్చి చెప్పారు.



## బంగాళాఖాతంలో అల్పపీడనం



**హైదరాబాద్:** బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడన ప్రభావం ఇంకా కొనసాగుతుండటంతో, రాష్ట్రవ్యాప్తంగా మరో మూడు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ప్రస్తుతం బంగాళాఖాతంలో ఉన్న అల్పపీడనం మరింత బలపడి ఒడిశా వైపు కదులుతోందని, దీని ప్రభావం తెలంగాణపై స్పష్టంగా కనిపిస్తుందని తెలిపింది. ఈ నేపథ్యంలో..నల్గొండ, యాదాద్రి-భువనగిరి, నాగర్‌కర్నూల్, నారాయణపేట, జోగులాంబ గద్వాల, వనపర్తి, మహబూబ్‌నగర్, వరంగల్, నిజామాబాద్, కరీంనగర్, రంగారెడ్డి, ఆదిలాబాద్, కొమురం భీం ఆసిఫాబాద్, ములుగు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు పడే అవకాశం ఉందని హెచ్చరించారు. ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని సూచించారు. వాతావరణ శాఖ ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితులు తప్ప బయటకు వెళ్లకూడదని, బయటకు వెళ్లినపుడు జాగ్రత్త తప్పనిసరిగా పాటించాలని సూచించింది. నాలుగైదు రోజులుగా కుండపోత వర్షాలతో ఇబ్బందులు ఎదుర్కొన్న హైదరాబాద్‌లో ఆకాశం శుక్రవారం మేఘావృతంగా ఉన్నప్పటికీ, వర్షం మాత్రం పడలేదు.

# దేశంలోని టాప్ 3 ఏపీ

**విజయవాడ:** దేశంలోని టాప్ 3 రాష్ట్రాల్లో ఒకటిగా ఏఎ ని నిలిపామని సీఎం చంద్రబాబు అన్నారు. నేడు 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరి ంచుకొని విజయవాడలోని ఇందిరా గాంధీ స్టేడియంలో వేడుకలను నిర్వహించారు. సీఎం చంద్రబాబు జెండా విష్కరణ చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ2014లో నవ్యాంధ్రప్రదేశ్‌కు మొదటి సీఎంగా ప్రజలు తనకు అవకాశం కల్పించాన్నారు. అనుభవం, ప్రజల సహకారంతో కష్టపడి దేశంలో టాప్ 3 రాష్ట్రాల్లో ఒకటిగా ఏపీని నిలిపామని చెప్పారు. 2019లో వచ్చిన ప్రభుత్వం రాష్ట్రాన్ని విధ్వంసం చేసిందని, ఏపీ బ్రాండ్ ను నాశనం చేసిందని విమర్శించారు. రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి పోయిందన్నారు. రూ.10 లక్షల కోట్ల అప్పులతో ఆర్థిక విధ్వంసం చేశారని ధ్వజమెత్తారు. తవ్విన కొద్దీ గత ప్రభుత్వం చేసిన అప్పులు, తప్పులు, అక్రమాలు, అవకతవకలు వెలుగుచూస్తున్నా యని చంద్రబాబు అన్నారు. ప్రధాన ఎన్నికల



హామీలైన 'సూపర్ సిక్స్' ను సూపర్ హిట్ చేశామని చంద్రబాబు తెలిపారు. 'తల్లికి వందనం' పథకం కింద కోట్లాది తల్లులకు ఆర్థిక భరోసా కల్పించామని, 'ఎన్టీఆర్ భరోసా' ద్వారా 64 లక్షల మందికి ఇంటి వద్దకే పింఛన్లు అందిస్తున్నామని వివరించారు. 'అన్నదాత సుఖీభవ' కింద 47 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.3,173 కోట్లు జమ చేశామని, 'దీపం' పథకం ద్వారా ప్రతి పేద కుటుంబానికి ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా అందిస్తున్నామని పేర్కొన్నారు.

# 79 ఏండ్ల స్వతంత్ర భారతంలో

### కేసీఆర్‌లా పాలించిన నాయకుడు ఒక్కరు కూడా లేరు : కేటీఆర్

**హైదరాబాద్ :** తెలంగాణ కోసం కేసీఆర్ ఏం చేశారని ప్రశ్నించే సన్నాసులకు 25 ఏండ్ల క్రితం ఈ గడ్డపై ఉన్న నిర్బంద పరిస్థితులు ఏ మాత్రం తెలియని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణకు బద్ధ వ్యతిరేకి అయిన చంద్రబాబు కేంద్రంలో చక్రం తిప్పుతుంటే రాజకీయ పార్టీ పెట్టాలని ఆలోచించడమే దుస్సాహసం అన్నారు. శూన్యం నుంచి సునామీని సృష్టించినట్టుగా తెలంగాణ రానే రాదన్న అనుమానాలను పటాపంచలు చేసి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన కారణ జన్ముడు కేసీఆర్ అన్నారు. తల్లికి జన్మనిచ్చిన తనయుడు అని కేసీఆర్‌ను ప్రజాకవి గోరటి వెంకన్న ప్రశంసించడం ఏమాత్రం అతిశయోక్తి కాదన్నారు. మహేంద్ర తోటకూరి రచించిన ప్రజా




యోధుడు పుస్తకాన్ని తెలంగాణ భవన్‌లో ఆవిష్కరించిన కేటీఆర్, భారత స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఈ పుస్తకావిష్కరణ జరగ౼డం సముచితమని, తెలంగాణ సమాజానికి, ముఖ్యంగా కేసీఆర్ కి ఇది గొప్ప కానుక అన్నారు.

## జమ్మూకాశ్మీర్‌లో క్లౌడ్ బరస్ట్

# 60కి చేరిన మృతుల సంఖ్య

**జమ్మూకాశ్మీర్:** జమ్మూకాశ్మీర్ లోని చషోటి గ్రామంలో క్లౌడ్ బరస్ట్ పెను విషాదం మిగిల్చిన సంగతి తెలిసిందే. క్లౌబ్ బరస్ట్ కారణంగా పదుల సంఖ్యలో జనం ప్రాణాలు పోగొట్టుకోగా.. దాదాపు 200 మంది గల్లంతు అయ్యా రు. శుక్రవారం మధ్యాహ్నం నాటికి మృతుల సంఖ్య 46 నుంచి 60కి చేరింది. చనిపోయిన వారిలో ఇద్దరు సీఆర్‌పీఎఫ్ జవాన్లు కూడా ఉన్నారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. సంఘటన జరిగిన ప్రాంతంలో సహాయక చర్యలు ఊపందు కున్నాయి. ఆర్మీ కూడా సహాయక చర్యల్లో భాగమైంది. ఇప్పటి వరకు 160 మందిని రక్షిం చినట్లు తెలుస్తోంది. ఒమర్ అబ్దుల్లాకు ప్రధాని మోదీ ఫోన్ కాల్ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం ఉదయం జమ్మూకాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాలతో క్లౌడ్ బరస్ట్ విషాదంపై ఫోన్ చేసి మాట్లాడారు. అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అవసరమైనంత సాయం చేస్తానని ప్రకటించారు. ఈ మేరకు ఒమర్ అబ్దుల్లా తన ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. 'ఇప్పుడే ప్రధాని నరేంద్ర మోదీనుంచి నాకు కాల్ వచ్చింది. కిస్త్వార్‌లోని పరిస్థితుల గురించి ఆయనకు వివరించి చెప్పాను. అధికారులు తీసుకుంటున్న చర్యలను కూడా వివరించాను. ఆయన మద్దతు, సాయానికి మా ప్రభుత్వం, బాధిత ప్రజలు ఎంతో రుణపడి ఉంటారు' అని పేర్కొ న్నారు. భక్తులే బాధితులుదేశం నలుమూలల నుంచి భక్తులు పెద్ద ఎత్తున కిస్త్వార్‌లోని మాచైల్ మాత ఆలయానికి వస్తూ ఉంటారు. యాత్రకు వెళ్లే వారికి చషోటి గ్రామమే బేస్ పాయింట్. ఇక్కడ యాత్రికుల కోసం సామూహిక వంటశాలలు ఏర్పాటు చేస్తారు. భక్తులు ఇక్కడే వాహనాలు వదిలి, కాలినడకన మాచైల్ మాత గుడికి వెళతారు. గురువారం మధ్యాహ్నం ఒక్కసారిగా మెరుపు వరదలు రావడంతో భక్తుల టెంట్లు, దుకాణాలు, వసతి సౌకర్యాలు, సెక్యూరిటీ అవుట్ పోస్టులన్నీ కొట్టుకుపోయాయి. భారీగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది.



## ఈసీని మేనేజ్ చేస్తే

# అన్ని సీట్లే ఎందుకు వస్తాయి

**హైదరాబాద్, ఆగస్టు 15:** తెలంగాణలో తిరంగా ర్యాలీలు ఘనంగా నిర్వహించారని కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తెలిపారు. ఈ ర్యాలీలో విద్యార్థులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారని చెప్పారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం మూర?త్వంతో జెండాలు ఎగురవేయనీయ లేదని ఆయన మండిపడ్డారు. శుక్రవారం హైదరాబాద్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్ విలేకర్లతో మాట్లాడుతూ.. ప్రధాని మోదీ వచ్చిన తరువాత ప్రతి ఒక్కరూ జెండా ఎగురవేసే కార్యక్రమాన్ని చేపట్టారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమం ప్రధాని మోదీ ఆలోచన అని పేర్కొన్నారు. మోదీ పాలనకు ముందు పరిస్థితి.. ఆ తర్వాత ఏమిటనేది ప్రజలు చూస్తున్నారని చెప్పారు. అవినీతి రహిత పాలన అందిస్తున్నారంటూ ప్రధాని మోదీపై ప్రశంసల వర్షం కురిపించారు. రెండు రాజ్యాంగాలు అవసరం లేదంటూ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ పోరాటం చేశారని వివరించారు. ఓట్లు గల్లంతు విషయంలో ఎన్నికల సంఘానికి, బీజేపీకి, ప్రధాని మోదీకి ఏం సంబంధమంటూ ఆయన ప్రశ్నించారు దీనిపై ఫిర్యాదు చేస్తే.. ఈసీ చర్యలు తీసుకుంటుందన్నారు. ఎన్నికల సంఘాన్ని తాము మేనేజ్ చేసేలా ఉంటే 240 ఎంపీ సీట్లకు ఎందుకు పరిమితమవుతామంటూ ప్రతిపక్షాలను బండి సంజయ్ సూటిగా ప్రశ్నించారు. హైదరాబాద్ ఓల్డ్ సిటీలో ఒక్క ఇంట్లోనే 300 ఓట్లు ఉన్నాయని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అయితే కాంగ్రెస్ వాళ్లు 60 ఏళ్ళు దేశాన్ని దోచుకున్నారని.. దీనిపై తాము మీరు రిగ్గింగ్ చేశారని ఎప్పుడైనా అన్నామా అంటూ ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ వ్యవహారంతో కాంగ్రెస్ పార్టీ కుక్కలు చింపిన విస్తరి అయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీహార్‌లో మీ పార్టీని నమ్మరని.. అక్కడ గెలిచేది బీజేపీనే అంటూ కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకత్వానికి ఈ సంద ర్భంగా స్పష్టం చేశారు. ఫామ్‌హౌస్‌కు చేరుకున్న కవితరాజ్ భవన్‌లో ఎట్ హోమ్.. హాజరైన సీఎం, డిప్యూటీ సీఎం దంపతులుఇక మార్వాడీలు గో బ్యాక్ అనేది కొంతమంది కమ్యునిస్టులు, కాంగ్రెస్,బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలతో కలిసి నేతలు ఆడుతున్న నాటకమని ఆయన అభివర్ణించారు.



# 16 మందికి శౌర్య పతకాలు

ఆపరేషన్ సిందూర్‌లో ధైర్యసాహసాలు ప్రదర్శించినందుకు 16 మంది సైనికులకు శౌర్య పతకాలు ప్రకటించారు. ఆపరేషన్ సిందూర్‌లో, భారత సైన్యం, ఇతర భద్రతా సిబ్బంది సంయుక్తంగా పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద, సైనిక స్థావరాలపై ఆపరేషన్లు నిర్వహించారు. ఏప్రిల్ 22న పహల్గామ్ ఉగ్రవాద దాడికి ప్రతీకారంగా.. ఈ ఆపరేషన్ మే 7 నుంచి 10 వరకు జరిగింది. ఆపరేషన్‌లో రెండు సైనికులు ప్రాణాలు కోల్పోగా, ఏడుగురు గాయపడ్డారు. మరోవైపు, జమ్మూ కాశ్మీర్ పోలీసులు, ఛత్తీస్‌గఢ్ పోలీసులు సహా ఇతర సిబ్బందికి కూడా శౌర్య పతకాలను ప్రకటించారు. ఈ మెడల్స్ భారత్ సరిహద్దుల తొలి రక్షకుల ధైర్యానికి, నేషనల్ విశ్వాసానికి గుర్తింపు అని అధికారులు తెలిపారు. శౌర్య పతకాలతో పాటు..స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పోలీసు, ఫైర్ సర్వీస్, హోం గార్డ్, సివిల్ డిఫెన్స్ విభాగాల అధికారులకు వివిధ రకాల గ్యాలంట్రీ, సర్వీస్ పతకాలను కేంద్ర హోంశాఖ గురువారం ప్రకటించింది. ఈ జాబితాలో మొత్తం 1,090 మంది




ఉన్నారు. కేంద్ర హోంశాఖ వివరాల ప్రకారం, వీటిలో 233 గ్యాలంట్రీ అవార్డులు, 99 రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు, 758 ప్రశంసనీయ సేవా పతకాలు ఉన్నాయి. విధి నిర్వాహణలో అసమాన ధైర్యసాహసాలు ప్రదర్శించిన వారికి అందించే గ్యాలంట్రీ పతకాలలో ఎక్కువ భాగం జమ్మూ కశ్మీర్ సిబ్బందికే దక్కాయి. 226 శౌర్య పతకాలు పోలీసులకుపోలీసు విభాగంలో మొత్తం 226 మంది గ్యాలంట్రీ పతకాలకు, 89 మంది రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలకు, 635 మంది ప్రశంసనీయ సేవా పతకాలకు ఎంపికయ్యారు. వీరి తరువాత సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ సరిహద్దు భద్రతా దళం సిబ్బంది ఉన్నారు.

# మైత్రి డ్రగ్స్ పరిశ్రమపై రైతుల ఆగ్రహం







- మైత్రి డ్రగ్స్ పరిశ్రమ ముందు రైతుల ధర్నా
- కాలుష్య ఫ్యాక్టరీలపై అధికారులు చర్యలు తీసుకోండి
- పిసిబి అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ ఎటువంటి చర్యలు లేవు
- తహసీల్దార్ పరమేశం,గుమ్మడిదల ఎస్సై పరిశ్రమ వద్దకు చేరుకుని పరిస్థితిని సమీక్ష
- పరిశ్రమ వ్యర్థాలను వర్షపు నీటితో కలిపి చుట్టుపక్కల
- రైతుల పంట పొలాల్లోకి వదలిన చర్యలు లేవు



**గుమ్మడిదల,వాస్తవ తెలంగాణ న్యూస్:** గుమ్మడిదల బొంతపల్లి పారిశ్రామిక మైత్రి డ్రగ్స్ పరిశ్రమ వ్యర్థాలను వర్షపు నీటితో కలిపి చుట్టుపక్కల రైతుల పంట పొలాల్లోకి వదులుతున్నారని రైతులు ఆరోపించారు. ఏళ్ల తరబడి ఈ సమస్యను ఎదుర్కొంటున్నప్పటికీ పరిశ్రమ యాజమాన్యం, అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం బాధిత రైతులు పరిశ్రమ గేటు ముందు భారీ ఎత్తున ఆందోళన నిర్వహించారు. రైతులు మాట్లాడుతూ.. “మైత్రి డ్రగ్స్ పరిశ్రమలోని కెమికల్ రసాయన వ్యర్థాలు తరచుగా తమ పొలాల్లోకి వదులుతున్నారని అన్నారు. ఈ సమస్య ఏళ్ల తరబడి కొనసాగుతుందని తెలిపారు. పలుమార్లు పిసిబి అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షపు నీటితో కలిసిన రసాయనాలు పంటలకు తీవ్రమైన నష్టం కలిగిస్తున్నాయని.. పంటను పండించలేక, జీవనోపాధి నాశనం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమపై కఠిన చర్యలు తీసుకోవాలని, సమస్యను సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.సమస్యకు పరిష్కారం చూపేవరకు ఆందోళనను కొనసాగిస్తామని హెచ్చరించారు.రైతుల

**- ఆందోళనపై అధికారుల స్పందన**

సమస్య గురించి సమాచారం తెలుసుకున్న మండల తహసీల్దార్ పరమేశం,గుమ్మడిదల ఎస్సై పరిశ్రమ వద్దకు చేరుకుని పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. రైతులకు నచ్చజెప్పి, సమస్యను తక్షణమే గమనించి తగిన పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. పిసిబి అధికారులు పరిశ్రమ వ్యర్థాలను స్వీకరించి, రిపోర్టు ఆధారంగా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## విద్యార్థులకు షూ, బెల్టులు, బ్యాగులు అందించిన గోపులారం మాజీ సర్పంచ్ పొడవు శ్రీనివాస్.

**శంకర్పల్లి వాస్తవ తెలంగాణ న్యూస్** 79వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని శంకర్ పల్లి మండలం గోపులారం గ్రామ మాజీ సర్పంచ్, రంగారెడ్డి జిల్లా మాజీ సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి పొడవు శ్రీనివాస్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు షూ, బెల్టులు, బ్యాగులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుండే ఇష్టపడి చదువుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు ధాన్యమైన విద్యను అందించాలని కోరారు. మధ్యాహ్న భోజనం నిర్లక్ష్యం చేయకుండా రుచికరంగా వండి విద్యార్థులకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సామయ్య, బయన్న, ఏ ఏ పీ సి చైర్మన్ లక్ష్మి, మాజీ వార్డు సభ్యులు సురేందర్, వెంకట్ రెడ్డి, శంకర్ పల్లి ఏఎంసి డైరెక్టర్ రవీందర్ రెడ్డి, ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం సహాయ కార్యదర్శి తొండ యాదయ్య, ప్రధానోపాధ్యాయులు సాయిబాబా, ఉపాధ్యాయులు రాజు, సంగీత, బాలమణి, గ్రామ పెద్దలు రాంరెడ్డి, సత్యనారాయణ, టీజీ. రవి, మల్లేష్, యువజన సంఘం నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.





## ప్రతి భారతీయుడు ఓ స్వామి వివేకానంద ఓ సుభాష్ చంద్రబోస్ లు కావాలి

- శంకర్ పల్లి సేవా ఫౌండేషన్ ప్రెసిడెంట్ ఆర్ నరేష్ కుమార్.
- ఘనంగా పంద్రాగస్టు వేడుకలు

**శంకర్పల్లి వాస్తవ తెలంగాణ న్యూస్** ప్రతి భారతీయుడు స్వామి వివేకానందునిలా సుభాష్ చంద్రబోస్ ల తయారైనప్పుడే మన భారతదేశం ప్రపంచంలో మరింత కీర్తిని సాధిస్తుందని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉంటారని శంకర్ పల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షులు ఆర్ నరేష్ కుమార్ ఉన్నారు. శుక్రవారం నాడు 79 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు పురస్కరించుకొని శంకర్ పల్లి సేవా ఫౌండేషన్ కార్యాలయం వద్ద శుక్రవారం మువ్వన్నెల భారతీయ జాతీయ పతాకాన్ని అధ్యక్షులు ఆర్ నరేష్ కుమార్ ఎగురవేసి జెండాకు సాష్టాంగ ప్రణామం చేశారు. ఈ సందర్భంగా నరేష్ కుమార్ మాట్లాడుతూ ప్రజలందరూ దేశానికి స్వాతంత్రం తీసుకొచ్చిన త్యాగధనుల మాదిరిగా నీతి నిజాయితీగా ఉన్నప్పుడు గ్రామాలన్నీ అభివృద్ధి అవుతాయని తెలిపారు. విద్యార్థినీ విద్యార్థులు, యువకులు దేశభక్తుల అడుగుజాడల్లో నడిచి వారి ఆశయాలను సమాజానికి అందించాలని కోరారు. సనాతన ధర్మాన్ని ప్రతి ఒక్కరూ పాటించినప్పుడు భారతదేశం అగ్రగామిగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవ ఫౌండేషన్ అధ్యక్షులు ఆర్ నరేష్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ 2 ఖానాపూర్ కార్తీక్. ప్రధాన కార్యదర్శి వేనేంద్ర చారి. ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ మహేందర్ రెడ్డి, కరాటే రవీందర్ యాదవ్, మాజీ వార్డ్ మెంబర్ ఎం నాగమణి, సభ్యులు ధీరజ్ కుమార్, సత్తి యాదవ్, శేఖర్ గౌడ్, దత్తు కుమార్, సుజాత, అనురాధ, టింకు, సందీప్ నాయకులు





## శంకర్ పల్లి పట్టణంలో ఘనంగా 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు.

**శంకర్పల్లి వాస్తవ తెలంగాణ న్యూస్** శంకర్ పల్లి పట్టణంలో శుక్రవారం 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను నాయకులు, అధికారులు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక పురపాలక సంఘం కార్యాలయం ఎదుట కమిషనర్ యోగేష్ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట ఎంపీడీవో వెంకయ్య గౌడ్ జాతీయ జెండాను ఎగురవేశారు. శంకర్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ఎదుట చైర్మన్ చేకూర్త గోవిందమ్మ గోపాల్ రెడ్డి మువ్వన్నెల జెండాను ఎగరవేశారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయం ఎదుట తహసిల్దార్ సురేందర్ జాతీయ జెండాను ఎగురవేశారు. పోలీస్ స్టేషన్ ఎదుట సిఐ శ్రీనివాస్ గౌడ్, శంకర్ పల్లి పిఎసిఎస్ వద్ద చైర్మన్ బద్దం శశిధర్ రెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమాల్లో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాశెట్టి చంద్రమోహన్, మాజీ ఎంపీపీ విష్ణు పంతులు సత్యనారాయణ, మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ భానుర్ వెంకటరామిరెడ్డి, స్థానిక ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రకాష్ గుప్తా, శంకర్ పల్లి మాజీ ఉపసర్పంచ్ ప్రవీణ్ కుమార్, వివిధ పార్టీల నాయకులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.





## ఆర్.ఎస్.పి పార్టీ కార్యాలయంలో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు





**మేడ్చల్ వాస్తవ తెలంగాణ** ఉదయం మేడ్చల్ లోని రాష్ట్ర సామాన్య ప్రజా పార్టీ ప్రధాన కార్యాలయంలో స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా పార్టీ అధ్యక్షులు, కంటెస్టెడ్ మేడ్చల్ ఎమ్మెల్యే జె.శ్రీనివాస్ గారు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎందరో స్వాతంత్ర సమరయోధుల త్యాగాల ప్రతిఫలం మన భారతదేశానికి స్వాతంత్రం.. వారి త్యాగాలను గుర్తు చేసుకుంటూ మనము స్వాతంత్ర దినోత్సవ వేడుకలను జరుపుకుంటున్నాం. అలాగే వారి త్యాగాలను వృధా కానివ్వకుండా మన దేశ ఉన్నతికి మన వంతు కృషి చేయాలి. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా మన దేశ కీర్తిప్రతిష్టలు పెంపొందేలా దేశానికి గుండెకాయలాంటి భారత రాజ్యాంగాన్ని గౌరవించి, రాజ్యాంగం ప్రకారం మనుషులందరూ సమానమే అని ఎంచి కుల, మత, వర్గ, వర్ణ భేదం చూపక ప్రతి మనిషిని సమానంగా చూడగలిగిన వాడే నిజమైన దేశభక్తుడు, ప్రజల స్వేచ్ఛను గౌరవించగలిగిన వాడే నిజమైన భారతీయుడు అని జె.శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి ఆనగాల రాములు, కార్యదర్శి ముక్కెర లక్ష్మీనారాయణ, సీనియర్ నాయకులు కే వెంకటేష్, నీరుడి సందీప్ కుమార్, రాహుల్ రెడ్డి, మనోజ్ కుమార్, ఎం గణేష్, సిహెచ్ కృష్ణ, పి అశోక్, ఎస్ వినోద్, వి సంతోష్, ఎస్ ఉపేందర్, జి రంజిత్, మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఆర్డిఓ గా అవార్డు అందుకున్న చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ



**శంకర్పల్లి వాస్తవ తెలంగాణ న్యూస్** స్వతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రకటించే అవార్డులలో చేవెళ్ల ఆర్డిఓ చంద్రకళ ఉత్తమ ఆర్డిఓ అవార్డు అందుకున్నారు, ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ప్రజల సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు నిర్ణయం తీసుకున్న అధికారిగా చంద్రకళ గుర్తింపు పొందారు. దీంతో ప్రభుత్వం ఉత్తమ ఆర్డిఓ అవార్డు అందజేసింది.

## ఆపరేషన్ సింధూరులో పాల్గొన్న జవాన్ రెడ్యా నాయక్ ను సన్మానించిన మోకిలా పాఠశాల ఉపాధ్యాయ బృందం



**శంకర్పల్లి వాస్తవ తెలంగాణ న్యూస్** భారత దేశ సరిహద్దుల్లో నిరంతరం తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా దేశ రక్షణ కోసం పాటుపడుతున్న రంగారెడ్డి జిల్లా, శంకర్ పల్లి మండలం మోకిలా తండా యువకుడు జవాన్ కె. రెడ్యానాయక్ ఎస్ ఎస్ జి జమ్మూ కాశ్మీర్ ను 79వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా శుక్రవారం మోకిలా తాండ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయ బృందం ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఆపరేషన్ సింధూర్ లో రెడ్యానాయక్ పాల్గొన్నారని తెలిపారు.

## మరకత శివాలయ ప్రచార కమిటీ చైర్మన్ దయాకర్ రాజు స్వామి జన్మదిన వేడుకలు



**శంకర్పల్లి వాస్తవ తెలంగాణ న్యూస్** శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామ శివారులో గల 11 వ శతాబ్దానికి చెందిన మహిమగల శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయ ప్రచార కమిటీ చైర్మన్ దయాకర్ రాజు స్వామి జన్మదిన వేడుకలు శుక్రవారం ఆలయ ఆవరణలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు సాయి శివ, దయాకర్ రాజును స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి స్వామి వారి చిత్రపటాన్ని బహుకరించారు. ఆలయ కమిటీ సభ్యులు దయాకర రాజుకు 53వ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. దయాకర రాజు స్వామి మాట్లాడుతూ స్వామి వారి దయతో గ్రామ, మున్సిపల్, మండల ప్రజలు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో చల్లగా ఉండాలని స్వామివారిని కోరుకున్నట్టు చెప్పారు.

## క్రీడా విభాగంలో విద్యార్థులు రాణించాలి

- 50 వేల నగదు విద్యార్థులకు అందజేసిన: సంజివ రెడ్డి



**మనోహరబాద్ వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి నవీన్ :** విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి అని అన్ని రకాలుగా గ్రామ అభివృద్ధి తోడ్పాటు చేస్తామని గ్రామ పెద్దలు పాఠశాల విద్యార్థులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.వివరాల ప్రకారం మెదక్ జిల్లా మనోహరబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లి గ్రామంలో విద్యార్థులకు మాజీ సర్పంచి సంజీవ్ రెడ్డి క్రీడల కోసం 50, వేల నగదు ఇవ్వగా తాజా మాజీ సర్పంచ్ ప్రభావతి పెంటన్న ప్రథమ తృతీయ స్థానంలో ఉన్న విద్యార్థులకు నగదు బహుమానం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు అన్ని రకాలుగా అండగా ఉంటాం అని అన్నారు.ఉన్నత చదువుల కోసం మా తోడ్పాటు ఉంటుందని తెలిపారు..ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శేఖర్ రెడ్డి,ఎలక్షన్ రెడ్డి నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## 14వ వర్డ్ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో విద్యార్థులకు బుక్స్ అందించినా మాజీ సర్పంచ్ అశోక్ గౌడ్.





**కీసర మండల వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా నాగారం మున్సిపాలిటీ 14 వార్డ్ వెస్ట్ గాంధీనగర్ రోడ్ నెంబర్ 4లో కాలనీవాసుల పిలుపుమేరకు 79 వ స్వతంత్ర దినోత్సవ వేడుకల్లో నాగారం మాజీ సర్పంచ్ గూడూర్ అశోక్ గౌడ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో డి రాములు కాలనీవాసులు పాల్గొని జెండా ఆవిష్కరణ చేసినారు. తదుపరి కాలనీలో చిన్నపిల్లలకు బుక్స్ పెన్నులు పంచడం జరిగినది.

## స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నా ముప్పు శ్రీనివాస్ రెడ్డి





**కీసర మండల వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా నాగారం మున్సిపాలిటీ పరిధి పలు కాలనీలలో జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో నాగారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే నాగారం జడ్పీహెచ్ఎస్ స్కూల్లో 79వ స్వతంత్ర దినోత్సవం సందర్భంగా 2024- 25 క్యాలెండర్ ఇయర్ పదవ తరగతిలో ఫస్ట్ సెకండ్ థర్డ్ ర్యాంకులు వచ్చిన విద్యార్థులకు నగదు బహుమతి నీ ముప్పు శ్రీనివాసరెడ్డి ప్రదానం చేశారు. 1వ ర్యాంక్ జి సుహాసిని కి రూపాయలు 5000, 2వ ర్యాంక ఏ లిఖిత్ కి రూపాయలు 3000, 3వ ర్యాంక్ ఎస్ లక్ష్మీ కీర్తన కి రూపాయలు 2000 బహుమానం ఇవ్వడం జరిగింది. విద్యార్థులకు నగదు బహుమానం ఇచ్చినందుకు హెడ్మాస్టర్ రాములు ముప్పు శ్రీనివాసరెడ్డి కి కృతజ్ఞతలు తెలుపడం జరిగింది ..ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్మాస్టర్ రాములు, నాగారం శ్రీ భవాని నాగాలింగేశ్వర స్వామి టెంపుల్ చైర్మన్ మాదిరెడ్డి ప్రతాపరెడ్డి, సీనియర్ రిపోర్టర్ బిక్షపతి, స్కూల్ టీచర్స్ ,విద్యార్థిని పాల్గొన్నారు ు

## ఘనంగా 79 వ స్వతంత్ర దినోత్సవ వేడుకలు

**- ఎస్సీ సెల్ అధ్యక్షుడు కుండా భానుచందర్**



**మేడ్చల్ వాస్తవ తెలంగాణ** గుండ్లపోచంపల్లి మున్సిపల్ 5వ వార్డు లో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు కుండ భానుచందర్ ఆధ్వర్యంలో 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు ఈ కార్యక్రమంలో గుండ్ల పోచంపల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు కుండ భానుచందర్, నర్సింగరావు, రాజుకుమార్, ప్రవీణ్ కుమార్, బాబురావు, ఉదయ్, దప్పు రాజు, కృష్ణ, సాయిలు, జోగోల్ల చింటూ, స్వామి తదితరులు పాల్గొన్నారు.ు

## పూడూర్ జడ్పీహెచ్ఎస్ స్కూల్లో 79వ స్వతంత్ర వేడుకలు

**- బహుమతులు అందజేసిన మల్లికార్జున్**



**మేడ్చల్ వాస్తవ తెలంగాణ** మేడ్చల్ పట్టణంలోని మేడ్చల్ మున్సిపల్ పూడూర్ జడ్పీహెచ్ఎస్ హైస్కూల్లో 79 వ స్వతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి స్వతంత్రం తెచ్చిన మహనీయులని స్మరించుకుంటూ జాతీయ పతాకాన్ని ఎగురవేసి కులమత బేధం లేదంటూ అందరూ సమానమేనని చాటి చెప్పేలా ఈ జెండా పండుగ జరుపుకోవాలని విద్యార్థి దశ నుంచి దేశ సార్వభౌమాధికారాన్ని సమగ్రతను కాపాడుతానని గొప్ప సంకల్పంతో ముందుకు సాగాలని తుపాకుల మల్లికార్జున్ విద్యార్థులు ఉద్దేశించి మాట్లాడడం జరిగింది ఈ కార్యక్రమంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా పూడూరు జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు తుపాకుల శివశంకర్, నాగమణి ముదిరాజ్ జ్ఞాపకార్థం (టీఎస్ఎన్ఎం ఫౌండేషన్) ఆధ్వర్యంలో తుపాకుల మల్లికార్జున్ ముదిరాజ్ చేతుల మీదుగా అవార్డులు అందజేశారు.

## ఉత్తమ తహసిల్దార్ అవార్డును అందుకున్న శంకర్ పల్లి తహసిల్దార్ సురేందర్

**శంకర్పల్లి వాస్తవ తెలంగాణ న్యూస్** ఉత్తమ తహసిల్దార్ అవార్డును శంకర్ పల్లి తహసిల్దార్ సురేందర్ శుక్రవారం అందుకున్నారు. స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ఈ అవార్డును రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు.



## కిష్టాపూర్ లో ఘనంగా 79వ స్వతంత్ర దినోత్సవ వేడుకలు

**ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు పరశురామ్**

**మేడ్చల్ వాస్తవ తెలంగాణ** 79వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా కిష్టాపూర్ నాలుగో వార్డ్ లో ఎమ్మార్పీఎస్ మేడ్చల్ జిల్లా యువసేన అధ్యక్షుడు పరుశురాం ఆధ్వర్యంలో అంబేద్కర్ జగ్జీవన్ రామ్ చౌక్ కిష్టాపూర్ నాలుగో వార్డ్ లో చాలా ఘనంగా జాతీయ పథకాన్ని ఎగురవేస్తూ స్వాతంత్ర సమరయోధులు చేసిన పోరాటం ఫలితమే భారతదేశం స్వాతంత్రం సాధించుకున్న సందర్భంగా భారతీయులందరూ ఐక్యమత్యంతో ఉండాలని కులమత బేధాలు



లేకుండా మన భారతదేశాన్ని భిన్నత్వంలో ఏకత్వం తో ఉండి సుపరిపాలనతో అభివృద్ధి వైపు వెళ్తూ ప్రపంచ దేశాల్లో భారతదేశ ప్రాముఖ్యత ఇంకా కీర్తి చెందాలి అలాగే విపత్తు కాలంలో దేశంలోని ప్రజలంతా ఐక్యమత్యంతో ఉండడమే మన దేశ అభివృద్ధికి గాని సంరక్షణకు గాని చాలా ముఖ్యమైన అంశం అని మాట్లాడుతూ పరుశురాం తెలియపరిచారు ఈ కార్యక్రమంలో కిష్టాపూర్ నాలుగో వార్డ్ కాంగ్రెస్ పార్టీ విలేజ్ అధ్యక్షుడు తొంట యాదయ్య ఎం ఎస్ పి జిల్లా వైస్ ప్రెసిడెంట్ బాల నరసింహ భుజంగరావు సిహెచ్ బిక్షపతి అర్జున్ నర్సింగ్ రావు కుమార్ ప్రభాకర్ మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు, గ్రామస్తులకు జాతీయ జెండాలు అందజేసిన అశోక్ సాదుల

**శివ్వంపేట వాస్తవ తెలంగాణ న్యూస్:** మన భారతదేశ 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మన దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపుమేరకు "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమంలో భాగంగా ప్రతి భారతీయ పౌరుని ఇంటిపై జెండాను ఎగరవేయాలని పిలుపునివ్వడం జరిగింది. ఇందులో భాగంగా శివ్వంపేట మండలంలోని ఉసిరికపల్లి గ్రామంలో భారతీయ జనతాపార్టీ యువ నాయకులు అశోక్ సాదుల గ్రామ పాఠశాలలోని విద్యార్థిని, విద్యార్థులకు జాతీయ జెండాలను ఇవ్వడం జరిగింది. అలాగే గ్రామంలో కూడా ఇంటింటికి జాతీయ జెండాలను అందజేయడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ ప్రజలందరూ కూడా వారి యొక్క ఇళ్లపై జాతీయ జెండాలను ఎగురవేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యా



యురాలు సాయి లత, పంచాయతీ కార్యదర్శి సుష్మ , అంగన్వాడీ టీచర్ విజయలక్ష్మి , ఆశా వర్కర్ గోపమ్మ, పాఠశాల చైర్మన్ కృష్ణ , మాజీ సర్పంచ్ బాబురావు, మాజీ ఉప సర్పంచ్ నరేందర్ రెడ్డి,



నాయకులు కృష్ణారావు, సత్య గౌడ్, బాలేష్, మాజీ సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు,వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ పట్టణంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**- మాజీ కౌన్సిలర్ కౌడే మహేష్ కురుమ**

**మేడ్చల్ జిల్లా** కేంద్రంలోని మేడ్చల్ పట్టణంలోని ఈరోజు జరిగిన 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలల్లో మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డులో గల అంగన్ వాడీ కేంద్రంలో జాతీయ జెండా ఆవిష్కరణ తదనంతరం కురుమ సంఘం భవనం వద్ద జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న మేడ్చల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ నాయకులు,23వ వార్డు మాజీ కౌన్సిలర్ శ్రీ కౌడే మహేష్ కురుమ.ఈ సందర్భంగా కౌడే మహేష్ కురుమ మాట్లాడుతూ%ూ% ఎందరో మహానుభావులు,పరాయి దేశపు పాలనలో బానిస సంకెళ్ల నుంచి విముక్తి కొరకై,వీరోచితమైన పోరాటాలతో సాధించిన స్వాతంత్ర్యానికి 79 సంవత్సరాలు%ూ%స్వేచ్చను ప్రసాదించిన అనేక మంది స్వాతంత్రసమరయోధుల త్యాగం చిరస్మరణీయం అని అన్నారు.వారు చేసిన త్యాగాలను గుర్తు చేసుకుంటూ ముందున్న భావితరాలకు జాతీయ సమైక్యతను చాటుతూ ఐక్యమత్యంతో ముందుకు సాగాలని తెలియజేశారు.స్వాతంత్ర్య సమరయోధుల జీవిత గాథలను మనందరం ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని మాజీ కౌన్సిలర్ కౌడే మహేష్ కురుమ తెలియజేసారు.ఈ కార్యక్రమంలో అంగన్ వాడీ టీచర్ ఇందిరా,ఆయా




మణెమ్మ,మేడ్చల్ జిల్లా అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ దుర్గం శివ శంకర్ ముదిరాజ్,మేడ్చల్ జిల్లా అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఉదండపురం సత్యనారామణ,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామన్నగారి సంతోష్ గౌడ్,మేడ్చల్ మున్సిపాలిటీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు లవంగు రాకేష్ వంజరి,మేడ్చల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ ఎస్ సి సెల్ అధ్యక్షులు దండు శ్రీకాంత్ (చింటు),మేడ్చల్ మున్సిపాలిటీ ఎన్ ఎస్ యూ ఐ అధ్యక్షులు గుండ శ్రీధర్ కురుమ,మేడ్చల్ మండల యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బట్టు మధు,మేడ్చల్ మండల కురుమ సంఘం అధ్యక్షులు గౌర్ల ఎర్ర భీరప్ప కురుమ,కౌడే భిక్షపతి కురుమ,అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్,మేడ్చల్ పట్టణ కురుమ సంఘం మాజీ అధ్యక్షులు ఒగ్గు



శంకర్ కురుమ,మేడ్చల్ పట్టణ మాజీ వార్డు మెంబర్ కౌడే నాగేందర్ కురుమ,మేడ్చల్ పట్టణ పెద్ద కుర్మ మైల జీతయ్య కురుమ,మేడ్చల్ పట్టణ కురుమ సంఘం అధ్యక్షులు గౌర్ల మధు కురుమ,ఉపాధ్యక్షులు ఒగ్గు సురేష్ కురుమ,ప్రధాన కార్యదర్శి కౌడే శ్రీశైలం కురుమ,కోశాధికారి మైల భీరేందర్,ఆర్గనైజర్ గుండ గణేష్ కురుమ,కౌడే నరేందర్ కురుమ,ఒగ్గు మల్లేష్ కురుమ,మైల మల్లేష్ కురుమ,ఒగ్గు శ్రీశైలం కురుమ,గౌర్ల మల్లేష్ కురుమ,మైల మహేందర్ కురుమ,కౌడే వెంకటేష్ కురుమ,రాజు నాయకులు,కార్యకర్తలు,ప్రజా ప్రతినిధులు,పుర ప్రముఖులు, నాయకులు,మహిళలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## గీతం లో దేశభక్తి, ఉత్సాహంతో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**- జెండాను ఎగురవేసి, స్ఫూర్తిదాయక ప్రసంగం చేసిన ప్రోవీసీ ప్రొఫెసర్ డీ.ఎస్. రావు**

**గీతం,పటాన్చెరు,వాస్తవ తెలంగాణ న్యూస్:** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని గాంధీజీ విగ్రహం వద్ద 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా, దేశభక్తి స్ఫూర్తితో నిర్వహించారు. ఉదయం 8.50 గంటలకు ఆరంభమైన ఈ వేడుకలలో పలువురు విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ శుభ సందర్భంగా, గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు జాతీయ జెండాను ఎగురవేసి, దేశ నిర్మాణంలో విద్యా సంస్థల పాత్రను ప్రతిబింబిస్తూ స్ఫూర్తిదాయకమైన ప్రసంగం చేశారు. ప్రసిద్ధ జై జవాన్, జై కిసాన్ లకు జై విజ్ఞాన్, జై అనుసంధాన్ లను జోడించడం ద్వారా భారతదేశ పురోగతికి దోహదపడాలని ఆయన విద్యా సమాజాన్ని కోరారు. మేధో, సాంకేతిక స్వావలంబనను సాధించడంలో నిజమైన



స్వాతంత్ర్యం ఉందని, విద్య ఆత్మ విశ్వాసం, సామర్థ్యం, నైపుణ్యాలు, ప్రపంచవ్యాప్తంగా నాయకత్వం వహించడానికి సరైన వైఖరిని పెంపొందించాలని ప్రొఫెసర్ డి.ఎస్. రావు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎన్ సీసీ క్యాడెట్లు, విశ్వవిద్యాలయ భద్రతా సిబ్బంది క్రమశిక్షణ, అంకితభావాన్ని ప్రదర్శించేలా కవాతు నిర్వహించారు. కళాకృతి విద్యా విభాగం శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించగా, భద్రతా సిబ్బంది మనోహరమైన



దేశభక్తి గీతాలను ఆలపించారు.భద్రతా సిబ్బందికి వారి అంకితభావం, సేవకు గుర్తింపుగా ప్రశంసా పత్రాలను అందజేశారు. ఆ తరువాత ఎన్ సీసీ క్యాడెట్ల ర్యాంక్ వేడుక జరిగింది. దేశ స్వాతంత్ర్యానికి చిరస్మరణీయమైన, అర్థవంతమైన నివాళిగా నిలిచేలా ఈ కార్యక్రమాన్ని స్టూడెంట్ లైఫ్ బృందం చాలా జాగ్రత్తగా సమన్వయం చేసింది. ఇందులో పాల్గొన్న వారందరికీ మిఠాయిలు, అందించడంతో ఈ వేడుకలు ముగిశాయి.

## అక్రమ సంబంధానికి అడ్డు వస్తున్నాడని కన్నకొడుకును చంపిన తల్లి.



**- ఇద్దరు నిందితుల రిమాండ్**

**తూప్రాన్ వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిది నవీన్ :** తమ అక్రమ సంబంధానికి అడ్డు వస్తున్నాడని కన్న కొడుకుని ప్రియుడితో కలిసి తల్లి హతమార్చిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శుక్రవారం తూప్రాన్ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్పి నరేందర్ గౌడ్ తెలిపిన వివరాలు ప్రకారం గత సంవత్సరం సెప్టెంబర్ 28 తేదీన తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని హల్దీ వాగులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం కాగా పోలీసులు కేసు నమోదు దర్యాప్తు జరిపి మృతుడు తూప్రాన్ మండలం వెంకటయపల్లి గ్రామానికి చెందిన అహ్మద్ పాషా (25) గా గుర్తించారు. కొడుకు కనిపించకుండా వెళ్లినా మృతుడి తల్లి



ఎలాంటి పిర్యాదు చేయకపోవడం తో మృతుడి తల్లి మహమ్మద్ రహేన పై అనుమానంతో పోలీసులు విచారించగా రహేన కు మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కందల బిక్షపతి అనే వ్యక్తి తో గత కొంత కాలంగా అక్రమ సంబంధం కలిగి ఉండడం తో తన బంధానికి కొడుకు అడ్డు వస్తున్నాడని మృతుడు అహ్మద్ పాషా ను నిందితులు బైక్ పై ఎక్కించుకుని వచ్చి అబోతుపల్లి వద్ద మద్యం తాగించి మెడకు చున్నీతో ఉరి వేసి హత్య చేసి హల్దీ వాగులో పడవేసి వెళ్లిపోయారని డిఎస్పి తెలిపారు.నిందితులు ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు డిఎస్పి తెలిపారు.కేసు చేదనలో చురుకుగా పనిచేసిన సీఐ రంగా కృష్ణ,ఎస్ఐ శివనందం, కృష్ణ, రాజు సిబ్బంది ని అభినందించిన డీఎస్పీ నరేందర్ గౌడ్..





# పటాన్చెరులో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు







**జాతీయ జెండాను ఎగరవేసిన ఎమ్మెల్యే జిఎంఆర్**

**అందరి సహకారంతో అభివృద్ధిలో అగ్రగామిగా పటాన్చెరు**

**పటాన్చెరు,వాస్తవ తెలంగాణ న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వ సహకారం, ప్రజల తోడ్పాటుతో పటాన్చెరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకొని వెళ్తున్నామని స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. 79వ స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకుని పటాన్చెరు డివిజన్ పరిధిలోని జిహెచ్ఎంసి కార్యాలయం, ఎంపీడీవో, ఎమ్మార్వో, మార్కెట్ కమిటీ, వివిధ సంక్షేమ సంఘాల కార్యాలయాలతో పాటు, మైత్రి మైదానంలో ఏర్పాటు చేసిన పంద్రాగస్టు వేడుకల్లో ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాలను ఎగురవేశారు. ప్రజలందరికీ స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ..మినీ ఇండియా గా పేరుందిన పటాన్చెరులో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తూ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు.కేజీ నుండి పీజీ వరకు ఉచిత విద్యను అందించేలా పటాన్చెరులో ప్రాథమిక పాఠశాల నుండి పీజీ కళాశాల వరకు ఆంగ్లం, తెలుగు మాధ్యమాల్లో విద్యను అందించడం జరుగుతుందన్నారు. ఈ సంవత్సరం నుండి పాలిటెక్నిక్ కళాశాల సైతం విద్యార్థులకు అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. పేద మధ్యతరగతి ప్రజలకు వైద్యం భారం కాకూడదన్న సమన్నత లక్ష్యంతో గత రెండు సంవత్సరాల క్రితం పటాన్చెరు పట్టణంలో శంకుస్థాపన చేసిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులు దాదాపు తుది దశకు చేరుకున్నాయని.. అతి త్వరలో ప్రారంభించబోతున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను పూర్తి పారదర్శకతతో అందిస్తున్నామని తెలిపారు

## అర్బన్ ప్రాథమిక పాఠశాలకు కంప్యూటర్లు అందజేత



**బొల్లారం,జిన్నారం వాస్తవ తెలంగాణ న్యూస్:** బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని అర్బన్ ప్రాథమిక పాఠశాలకు స్థానిక జాయ్ ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యం శుక్రవారం స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని పేద విద్యార్థులకు డిజిటల్ విద్యను అందించాలని సంకల్పంతో 5 కంప్యూటర్లను బహుకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జాయ్ ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యం ప్రసాద్ రెడ్డి, సతీష్ కుమార్ లు మాట్లాడుతూ... మారుతున్న కాలానికి అనుగుణంగా పేద విద్యార్థులకు డిజిటల్ విద్యను అందించాలనే సదుద్దేశంతో కంప్యూటర్లను ఒక సంవత్సర కాలానికి ఇంటర్నెట్ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న స్కూల్ యాజమాన్యాన్ని హెచ్ఎం బాల నరసింహారెడ్డి ప్రత్యేకంగా అభినందిస్తూ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం దాతలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ స్కూల్ అకాడమిక్ డైరెక్టర్ స్మిత భోగరాజు ప్రిన్సిపల్ దాక్షాయిని ఉపాధ్యాయులు సిబ్బంది విద్యార్థులు తల్లిదండ్రులు స్థానికులు పాల్గొన్నారు

# సామాజిక అసమానతలు తొలగినప్పుడే దేశ ప్రగతి

**- సామాజిక న్యాయం కాంగ్రెస్ తో నే సాధ్యం**
**- ఆనాడు స్వాతంత్ర్యం తెచ్చి స్వేచ్ఛను ప్రసాదిస్తే.**
**- నేడు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ లతో బడుగులకు అండగా నిలుస్తున్నారు**
**- ప్రజా పాలనతో అందరికి సంక్షేమ పథకాలు**
**- మహనీయుల ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్ పాలన**
**నీలం మధు ముదిరాజ్**
**చిట్కుల్ లో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు**





**పటాన్చెరు,వాస్తవ తెలంగాణ న్యూస్:** దేశంలో సామాజిక అసమానతలు తొలగి అన్ని వర్గాల ప్రజలకి ఆర్థిక, సామాజిక,న్యాయ, రాజకీయ రంగాల్లో సమాన అవకాశాలు దక్కినప్పుడే దేశం ప్రగతి బాటలో పయనిస్తుందని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. శుక్రవారం 79వ స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చిట్కుల్ ఎన్ఎంఆర్ క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 79 సంవత్సరాలు గడుస్తున్న దేశంలో ఇంకా ఆర్థిక సామాజిక అసమానతలు కొనసాగడం దురదృష్టకరమన్నారు. అన్ని వర్గాల ప్రజలకు రాజ్యాధికారం దక్కినప్పుడే సామాజిక అసమానతలు తొలగి దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందని తేల్చి చెప్పారు. ఆనాడు స్వాతంత్ర ఉద్యమంలో అలుపెరుగని పోరాటం చేసి స్వాతంత్ర్యం సాధించి దేశ ప్రజలకు స్వేచ్ఛను ప్రసాదించిన కాంగ్రెస్ పార్టీ నేడు అన్ని వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం అందిస్తూ ప్రజారంజక పాలన కొనసాగిస్తుందని కొనియాడారు. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీ సాక్షిగా 42% రిజర్వేషన్ల తో పాటు ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించడాన్ని ఆయన ఉదహరించారు. 42 శాతం రిజర్వేషన్ అమల్లోకి వస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ బిడ్డలు పెద్ద ఎత్తున లబ్ధి పొందుతారని స్పష్టం చేశారు. మహనీయుల ఆశయాలను అనుసరిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అందిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని తెలిపారు.

## శ్రీ అద్వైత పాఠశాలలో ఘనంగా పంద్రాగస్టు వేడుకలు,





**వస్తావా తెలంగాణ న్యూస్ ప్రతినిధి అనీల్ కుమార్:** 79 వ స్వతంత్ర దినోత్సవ వేడుకలు శుక్రవారం పటాన్చెరు మండలం ముత్త%శీ%గి పరిధిలోని వున్నటువంటి శ్రీ అద్వైత పాఠశాలలో ఘనంగా పంద్రాగస్టు వేడుకలు నిర్వహించి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర సమరయోధుల గొప్పతనం గురుంచి,వారి త్యాగాల గూర్చి కొనియాడారు.నేడు స్వాతంత్ర భారతదేశంలో స్వతంత్రియులుగా జీవిస్తున్నమంటే ఎందరో ప్రాణత్యాగ ఫలమే అని చెప్పుకొచ్చారు.నాటి పోరాటమే..నాడు స్వాతంత్ర సంబరాలుగా చేసుకుంటున్నామని పేర్కొన్నారు.విద్యార్థులు దేశభక్తి గేయలతో చక్కటి నృత్యాలను,ప్రదర్శనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రాదానోపాధ్యాయులు, ఉపాధ్యాయునీలు, విద్యార్థిని విద్యార్థులు మరియు తల్లి తండ్రులు పాల్గొన్నారు

# 30 లక్షల రూపాయల సొంత నిధులతో ఇంద్రేశం రహదారి మరమ్మతులు





**పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి**
**త్వరలో 80 లక్షల రూపాయలతో పూర్తిస్థాయి మరమ్మతులు**
**రహదారి విస్తరణ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు**

**పటాన్చెరు,వాస్తవ తెలంగాణ న్యూస్:** పటాన్చెరు మండల పరిధిలోని ఓ ఆర్ ఆర్ జంక్షన్ నుండి ఇంద్రేశం మీదుగా బేగంపేట వరకు గల రహదారిని 30 లక్షల రూపాయల సొంత నిధులతో మరమ్మతులు చేపడుతున్నట్లు పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఇంద్రేశం పరిధిలో చేపడుతున్న రహదారి మరమ్మతు పనులను ఆర్ అండ్ బి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంద్రేశం, బచ్చుగూడ, పోచారం, రామేశ్వరంబండ, పెద్దకంజర్ల, ఐనోలు, చిన్న కంజర్ల గ్రామాల పరిధిలో గృహనిర్మాణ రంగం శరవేగంగా అభివృద్ధి చెందడం మూలంగా పెద్ద ఎత్తున ట్రాఫిక్ పెరిగిందని తెలిపారు. నిత్యం వేలాది వాహనాలు ఈ రహదారి గుండా ప్రయాణాలు సాగిస్తున్నాయని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రహదారి విస్తరణ కోసం 22 కోట్ల రూపాయలు మంజూరు కాగా సాంకేతిక కారణాల మూలంగా నిధులు రద్దు అయ్యాయని తెలిపారు. తిరిగి రహదారి విస్తరణ కోసం ప్రస్తుత ప్రభుత్వానికి పూర్తిస్థాయి ప్రతిపాదనలు పంపించడం జరిగిందని పేర్కొన్నారు. తాత్కాలిక మరమ్మతుల కోసం రెండు నెలల క్రితం 20 లక్షల రూపాయల సొంత నిధులతో గుంతలు పూడ్చడంతో పాటు ప్యాచ్ వర్క్ చేపట్టడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. భారీ వర్షాల మూలంగా రహదారి అస్తవ్యస్తంగా తయారైందని పేర్కొన్నారు. ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవద్దన్న సంకల్పంతో తిరిగి 30 లక్షల రూపాయల సొంత నిధులతో ఇంద్రేశం నుండి ఐనోలు మీదుగా బేగంపేట వరకు రహదారి మరమ్మతుల పనులు ప్రారంభించడం జరిగిందని తెలిపారు. పూర్తి స్థాయి మరమ్మతుల కోసం ప్రభుత్వం 80 లక్షల రూపాయలు మంజూరు చేసిందని, త్వరలోనే టెండర్ల ప్రక్రియ పూర్తవుతుందని తెలిపారు. మరమ్మత్తులు పూర్తయ్యే వరకు ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి డిఈ రవీందర్, ఏఈ చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ అంతిరెడ్డి, బండి శంకర్, ట్రాఫిక్ ఎస్ఐ సిద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పుట్ట నర్సింగ్ రావు కూతురి వివాహ వేడుక



**గుమ్మడిదల,వాస్తవ తెలంగాణ న్యూస్:** గుమ్మడిదల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సింగ్ రావు కూతురి వివాహ వేడుక ఘనంగా గుమ్మడిదల లోని ఎంపిఆర్ ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్ లో శుక్రవారం వేద పండితుల మధ్య పెళ్లి వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ పటాన్చెరు నియోజకవర్గ ఇన్చార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ దంపతులు. కాంగ్రెస్ పార్టీ నాయకులు వివిధ పార్టీల నాయకులు బంధుమిత్రులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు

# కాప్రా డివిజన్ లో స్వతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న పరమేశ్వర్ రెడ్డి







**కప్రా మండల వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా కాప్రా మండలం సాయిబాబా నగర్ బ్లాక్ బి లో జెండా ఆవిష్కరించి మహాత్ముని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.. ప్రజలందరికీ స్వతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతదేశం స్వతంత్రం సాధించడానికి ఎంతోమంది మహానుభావుల త్యాగఫలమే అని... వారందరి కృషి వల్లే నేడు ఈరోజు మనం స్వేచ్ఛ వాయువులు పీల్చుకుంటున్నామని.. వారి యొక్క త్యాగఫలము.. కృషిని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత మనపై ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు నాగ సాషు, మేడ్చల్ మల్కాజిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విట్టల్ నాయక్, బాబురావు, మల్లారెడ్డి, శ్రీకాంత్ గౌడ్,టి.శ్రీహరి, సత్యనారాయణ, ప్రదీప్ సింగ్ నాగరాజు, శ్రీధర్ రెడ్డి, షాబుద్దీన్, జగదీష్, అలీ, సిద్ధిఖీ, అహ్మద్, షకీల్,రియాజ్, ముర్తజా, ఇర్ఫాన్, ఇమ్రాన్, చోటా భాయ్ , రాజేందర్ సింగ్, జితాధేర్ సింగ్, మధు కుమార్, ప్రకాష్ సింగ్, నితిన్ కుమార్, సాధం, మోహన్, ఎం డి రషీద్, సయ్యద్ మునావర్, లుక్మాన్ హకీమ్, షేక్ ఇస్మాయిల్, ఎం డి ముకర్రామ్,ఎం డి ఫర్హాన్, ఎం డి జీషన్,ఎం డీ ఇంతియాజ్, అబ్దుల్ రెహమాన్, అబ్దుల్ నబీ,అల్తాఫ్, నాని సింగ్, రజాక్, మునబర్, ఫహీమ్, ఇస్మాయిల్ అన్వర్,కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు,పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## 79 వ స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు పద్మవతి హెరీమ్స్ లో ఘనంగా జెండా ఆవిష్కరణ





**మేడ్చల్ వాస్తవ తెలంగాణ న్యూస్,** రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. 79వ స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా15 వ వార్డు పద్మావతి హెరీమ్స్ వద్ద మహాత్మా గాంధీ, చిత్ర పటానికి పూలమాల వేసి జాతీయ పథకాన్ని ఆవిష్కరించారు, కార్యక్రమంలో గాజుల లక్ష్మణ్,రాఘవులు, వెంకటయ్య, సాయినాథ్, కొండయ్య, శివకుమార్, వేణుగోపాల్ రెడ్డి, దినేష్, ప్రశాంత్, యోగేష్, భాను, విజయ్,అజయ్ కాలనీ సభ్యులు,యువకులు తదితరులు పాల్గొన్నారు.

# శూన్యం నుంచి సునామీని సృష్టించిన నాయకుడు కేసీఆర్ : కేటీఆర్

హైదరాబాద్ : శూన్యం నుంచి సునామీని సృష్టించిన నాయకుడు కేసీఆర్ అని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశంసించారు. తెలంగాణ ప్రజల మనోభావాలను భారత పార్లమెంట్‌కు చేరేలా ఉద్యమ నిర్మాణాన్ని చేయడం ఆషామాషీ వ్యవహారం కాదు. 'తల్లికి జన్మనిచ్చిన తనయుడు ఇతడు' అని గోరటి వెంకన్న కేసీఆర్‌ను ప్రశంసించడం ఏమాత్రం అతిశయోక్తి కాదు అని కేటీఆర్ అన్నారు. మహేంద్ర తోటకూరి రచించిన ప్రజా యోధుడు పుస్తకాన్ని తెలంగాణ భవన్‌లో కేటీఆర్ ఆవిష్కరించి మాట్లాడారు. 2004లో భారతదేశానికి తిరిగి వచ్చి ఉద్యోగం చేస్తూనే 2006 వరకు జయశంకర్ సార్, విద్యాసాగర్ సార్, కేసీఆర్‌తో గడిపే అవకాశం దక్కింది. ఈ రెండు సంవత్సరాల కాలంలో చాలా అనుమానాలు, సందేహాలను నివృత్తి చేసుకునే అవకాశం కలిగింది. పార్టీ ఆవిర్భావానికి దారితీసిన పరిస్థితులు, చరిత్రలో జరిగిన అంశాలపై అవగాహన పెంచుకున్నాను. రాష్ట్రం సాధించిన తర్వాత ఎవరైనా ఏదైనా మాట్లాడవచ్చు, కేసీఆర్ ఏం చేశాడని కొట్టిపారేయవచ్చు. కానీ 25 ఏళ్ల కిందటి పరిస్థితి మాత్రం ఇలా లేదు. ఆ రోజు కేంద్రంలో వాజపేయి నేతృత్వంలో ఎన్డీఏ అధికారంలో ఉంది. ఎన్డీఏ కన్వీనర్‌గా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తెలంగాణ బద్ధ వ్యతిరేకి చంద్రబాబునాయుడు ఉన్నారు. మరోవైపు తెలంగాణ దుర్భర పరిస్థితికి కారణమైన వందేళ్ల చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ ఉంది. ఆ రోజుల్లో కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ చాలా బలంగా ఉండేవి. అలాంటి పరిస్థితుల్లో తెలంగాణ కోసం ఒక పార్టీ పెట్టి, రాజకీయ శక్తిగా ప్రజల ఓట్లను ఆయుధంగా చేసుకొని పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లును పాస్ చేయించుకొని రాష్ట్రాన్ని సాధించుకుంటామని చెప్పడం దుస్సాహసం అని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్, కమ్యూనిస్టు, బీజేపీ వంటి జాతీయ పార్టీలు, తెలుగుదేశం, డీఎంకే వంటి ప్రాంతీయ పార్టీలు మాత్రమే ఇవాళ నిలదొక్కుకున్నాయి. కేసీఆర్ పార్టీ పెట్టినప్పుడు, ప్రపంచమంతా కుగ్రామంగా మారుతుంటే, సరిహద్దులు చెరిగిపోతుంటే ఇంకా ప్రాంతీయ తత్వాలు ఏమిటని విమర్శించారు. పదవి రాకపోతే తెలంగాణ నినాదాన్ని




ఎత్తుకుంటారు, పదవి రాగానే ఆ జెండాను పక్కన పెడతారన్న అపనమ్మకం తెలంగాణ సమాజంలో బలంగా ఉండేది. 1971లో తెలంగాణ ప్రజా సమితి బ్యానర్ మీద 11 మంది పార్లమెంట్ సభ్యులు గెలిచి కాంగ్రెస్‌లో విలీనం కావడం వల్ల, 370 మంది ఆత్మబలిదానాలు వృథా కావడంతో ఇక తెలంగాణ రాదన్న నిరాశ ప్రజల్లో ఉండేది. ఎన్టీఆర్, ఎంజీఆర్ లాగా కేసీఆర్ సినిమా స్టార్ కాదు. ఆయనకు కుల బలం, ధన బలం, మీడియా పవర్, బలగం ఏమీ లేవు. అలాంటి పరిస్థితుల్లో కాంగ్రెస్, టీడీపీ, బీజేపీలను తట్టుకొని పార్టీ పెట్టి, రాజకీయ లక్ష్యాలను సాధించాలంటే ఎంత కష్టమో, గమ్యం తెలియని ప్రయాణం ఎలా ఉంటుందో ఒకసారి ఊహించుకోండి. పార్టీ పెట్టినప్పుడు కేసీఆర్ వయస్సు 47 ఏళ్లు. రాజకీయ నాయకులకు అది టేకాఫ్ టైం. ఆ సమయంలో ఒక లక్ష్యంతో ప్రజల కోసం ముందుకు రావడం సాధారణ సాహసం కాదు. దృఢ సంకల్పం, దైవ బలం ఉన్న యోధుడికే అది సాధ్యమవుతుంది, సామాన్యులకు కాదు అని కేటీఆర్ అన్నారు. 2001 నుంచి 2014 వరకు ఆయన పడ్డ కష్టం ముందు ఇప్పుడు మనం ఎదుర్కొంటున్న కష్టం ఏమాత్రం కాదు. ఎన్నో ప్రతికూల శక్తులు అడ్డంగా ఉన్నప్పుడు, దుర్మార్గమైన రాజకీయ వ్యవస్థ పార్టీని చిదిమివేయాలని చూస్తున్నప్పుడు, తెలంగాణను నడిపే సమర్థత ఉందా అని మనల్ని అవహేళన చేస్తున్నప్పుడు కేసీఆర్ ఒక్కరే తెలంగాణ కోసం నిలబడ్డారు. మన భాష, మన యాసను సినిమాల్లో జోకర్లకు, విలన్లకు మాత్రమే ఉపయోగించారు. అలాంటి పరిస్థితుల్లో తెలంగాణ కోసం కొట్లాడాలంటే తెగింపు కావాలి. కలిసి వచ్చే కాలానికి నడిచొచ్చిన కొడుకులా కేసీఆర్ తెలంగాణ కోసం ఉద్యమించారు. ఎన్నో ఎదురుదెబ్బలు తగిలినా ఏ రోజు నమ్మకాన్ని కోల్పోకుండా, ప్రజల మీదనే భారాన్ని ఉంచి, దేవుడి ఆశీర్వాదంతో తెలంగాణ ఉద్యమాన్ని కేసీఆర్ కొనసాగించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వెళ్తున్న తాను తిరిగి తెలంగాణ గడ్డ మీదనే కాలు పెడతానని చెప్పాలంటే దానికి ఎంతో గుండె ధైర్యం కావాలి. "నేను ఎత్తిన జెండా దించితే రాళ్లతో కొట్టి చంపండి" అని 2001లో జరిగిన సింహగర్జనలో కేసీఆర్ ప్రజలకు చెప్పారు అని కేటీఆర్ గుర్తు చేశారు. ఆరు గ్యారెంటీలతో హామీలు ఇచ్చి ఏ ఒక్కటీ అమలు చేయని నేటి రాజకీయ నాయకుల మధ్య అలాంటి మాటను ఊహించలేం. కేసీఆర్ సచ్చుడో తెలంగాణ వచ్చుడో అని చెప్పే గుండె ధైర్యం కేసీఆర్‌కు మాత్రమే ఉంది. తెలంగాణ వచ్చాక ఒక అకుంఠిత దీక్షతో రాష్ట్రాన్ని పునర్నిర్మించారు. పల్లెల్లో ఏమేమి ఉండాలో ఆలోచించిన ఒకే ఒక్క నాయకుడు భారతదేశంలో కేసీఆర్. భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా పట్టణాలను ఎలా విస్తరించాలో ఆలోచించిన నాయకుడు కేసీఆర్. అందుకే పదేళ్లలో మనం సాధించిన విజయాలు మామూలు కాదు. "ఉద్యమకారులు మంచి పరిపాలన చేయలేరని అనుకునేవాళ్లం, కానీ మీకు మాత్రం మంచి నాయకుడు దొరికాడని" గతంలో అరుణ్ జైట్లీ మాతో అన్నారు. సాధించిన రాష్ట్రానికే ముఖ్యమంత్రి కావడం అందరికీ దక్కే అదృష్టం కాదు, నువ్వు కారణజన్ముడవని ఆనాటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ కేసీఆర్‌ను మెచ్చుకొని ఆశీర్వదించారు అని కేటీఆర్ గుర్తు చేశారు.

# శరవేగంగా ఖైరతాబాద్ గణపతి పనులు

ఖైరతాబాద్(హైదరాబాద్): గణపతి ఉత్సవాలకు మరో 15 రోజులు మాత్రమే ఉండడంతో ఖైరతాబాద్ భారీ గణపతి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రస్తుతం గణపతి ఫినిషింగ్ పనులు జరుగుతుండగా అవి పూర్తి కాగానే ఆర్టిస్టులు రంగులద్దే పనులు ప్రారంభించనున్నారు. ఈసారి ఖైరతాబాద్ గణపయ్య శ్రీ విశ్వశాంతి మహాశక్తి




గణపతిగా భక్తుల కుదర్శనమివ్వనున్నాడు. 69 అడుగుల ఎత్తు, 28 అడుగుల వెడల్పుతో శాంతమూర్తిగా బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల త్రిశక్తి సమేతుడిగా రూపుదిద్దుకుంటున్నాడు. గణపయ్యకు ఇరువైపులా ఉండేలా పూరి జగన్నాథుడు సుభద్ర, బలరాముడి సహా లక్ష్మీ సమేత హయగ్రీవస్వామి, ఖైరతాబాద్ గ్రామ దేవతగా పిలువబడే గజ్జెలమ్మ అమ్మవారిని తీర్చిదిద్దుతున్నారు. అయితే, ఇప్పటికే పెద్ద ఎత్తున సందర్శకులు వస్తూ సెల్ఫీలు, ఫొటోలు, వీడియోలు తీస్తూ సందడి చేస్తున్నారు. దీంతో ఈ ప్రాంగణం ఓ మంచి సెల్ఫీస్పాట్‌గా మారింది.

# పోరాటాలు చేసింది మేము పదవులు అనుభవించేది మీరు

హనుమకొండ : రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు మరోసారి చేదు అనుభవం ఎదురైంది. పబ్లిక్‌గానే కొండా సురేఖపై ఓ స్వాతంత్ర్య సమరయోధుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోరాటాలు మేము చేస్తే.. మీరు పదవులు అనుభవిస్తున్నారంటూ మంత్రి సురేఖపై ఆయన మండిపడ్డారు. హనుమకొండలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా కొండా సురేఖ జాతీయ జెండా ఎగురవేశారు. ఈ



సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధులను కొండా సురేఖ సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రిపై ప్రతాప్ రెడ్డి అనే ఫ్రీడమ్ ఫైటర్ నిప్పులు చెరిగారు. తన సమస్య చెప్పుకుందామంటే కలెక్టర్ అపాయింట్మెంట్ ఇవ్వడం లేదని, కోర్టు తీర్పు ఉందని చెప్పినా కనీసం పట్టించుకోవడంలేదని కొండా సురేఖకు ప్రతాప్ రెడ్డి తెలుపుతూ ఆగ్రహం వ్యక్తం చేశాడు. పోరాటాలు మేము చేస్తే, పదవులు మీరు అనుభవిస్తున్నారంటూ అసహనం వ్యక్తం చేశారయన. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది.

# ప్రయాణికులకు గుడ్ న్యూస్ ఆ రూట్లలో టికెట్ రేట్లు తగ్గింపు

హైదరాబాద్ : ప్రయాణికులను ఆకట్టుకునేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వినూత్న ఆఫర్లను తీసుకొస్తుంది. పండగ సీజన్‌లలో నగదు బహుమతులు వంటి పథకాలతో ఆక్యుపెన్సీ రేషియోను పెంచుకుంటున్న టీజీఎస్ఆర్టీసీ.. తాజాగా మరో బంపర్ ఆఫర్‌ను ప్రకటించింది. హైదరాబాద్ బెంగళూరు మధ్య నడిచే బస్సులలో ప్రయాణ ఛార్జీలపై 20 నుంచి 25 శాతం వరకు డిస్కౌంట్ అందిస్తోంది. ప్రస్తుతం ఈ రెండు నగరాల మధ్య టీజీఎస్ఆర్టీసీకి చెందిన పలు రకాల బస్సు సర్వీసులు అందుబాటులో ఉన్నాయి. ఇందులో సూపర్ లగ్జరీ, రాజధాని, లహరి ఏసీ స్లీపర్ కమ్ సీటర్, లహరి నాన్ ఏసీ సీటర్ కమ్ స్లీపర్, లహరి ఏసీ స్లీపర్ బస్సులు ఉన్నాయి. జహీరాబాద్, వరంగల్, ఖమ్మం, మియాపూర్, పికెట్, నిజామాబాద్ వంటి డిపోల నుంచి మొత్తం 24కు పైగా




సర్వీసులు ప్రతిరోజు ప్రయాణికులకు సేవలు అందిస్తున్నాయి. ఈ బస్సుల్లో డిస్కౌంట్ఈ డిస్కౌంట్ ఆఫర్ సూపర్ లగ్జరీ %-% లహరి ఏసీ బస్సులకు వర్తిస్తుందని టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం వెల్లడించింది. సూపర్ లగ్జరీ బస్సులలో ప్రస్తుత ఛార్జీలలో 20 శాతం తగ్గింపు లభిస్తుంది. లహరి ఏసీ బస్సులలో 25 శాతం మేర ఛార్జీలు తగ్గుతాయి. ఈ డిస్కౌంట్ ద్వారా ఒక్కో టికెట్‌పై ప్రయాణికులకు రూ.100 నుంచి రూ.150 వరకు ఆదా అవుతుంది. ఈ ఆఫర్‌ను సద్వినియోగం చేసుకోవాలని టీజీఎస్ఆర్టీసీ కోరుతుంది. తమ అధికారిక వెబ్‌సైట్ ద్వారా టికెట్లను బుక్ చేసుకోవాలని టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ ప్రయాణికులకు సూచించారు. ఈ నిర్ణయం ద్వారా బెంగళూరు వైపు ప్రయాణించే వారికి కొద్దిగా భారం తగ్గనుంది.

# రేషన్‌కార్డుదారులకు గుడ్‌న్యూస్ వచ్చే నెల సరుకులతో పాటు అది కూడా ఇస్తారు

హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం వచ్చే నెలలో రేషన్ కార్డుదారులకు సన్న బియ్యంతో పాటు పర్యావరణహిత బ్యాగులను పంపిణీ చేయనుంది. ఈ బ్యాగులు ఇప్పటికే జిల్లాల్లోని గోదాములకు చేరుకున్నాయి. వీటిపై 'అందరికీ సన్న బియ్యం ప్రజా ప్రభుత్వంతోనే సాధ్యం' అనే నినాదం, ఆరు గ్యారెంటీ పథకాల వివరాలు ముద్రించారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడంతో పాటు, ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో అవగాహన పెంచడం ఈ కార్యక్రమం లక్ష్యం. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు శుభవార్త తెలిపింది. వచ్చే నెలలో రేషన్ పంపిణీలో భాగంగా సన్నబియ్యంతో పాటు, పర్యావరణహిత బ్యాగులను కూడా పంపిణీ చేయనుంది. ఈ ప్రత్యేక బ్యాగులు ఇప్పటికే జిల్లాల్లోని ఎంఎల్ఎస్ (మెయిన్ లీగల్ సప్లై) గోదాములకు చేరుకున్నాయి. గోదాముల నుంచి రేషన్ డీలర్ల కార్డుల సంఖ్య ఆధారంగా ఈ బ్యాగులను సరఫరా చేస్తారు. ఈ పర్యావరణహిత బ్యాగులపై ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీ పథకాలను ప్రస్తావించడంతో పాటు.. 'అందరికీ సన్న బియ్యం ప్రజా ప్రభుత్వంతోనే సాధ్యం' అనే నినాదాన్ని ముద్రించారు. ఈ చొరవతో ప్రభుత్వం తన కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. గత ప్రభుత్వ హయాంలో సన్న బియ్యం పంపిణీలో ఇబ్బందులు ఎదురైన నేపథ్యంలో.. ప్రస్తుత ప్రభుత్వం



ఈ విషయంలో ప్రాధాన్యత ఇస్తుందని ఈ నినాదం ద్వారా తెలియజేస్తోంది. పర్యావరణ పరిరక్షణకు తోడ్పడేలా ప్లాస్టిక్ కవర్లకు బదులుగా ఈ బ్యాగులను పంపిణీ చేయడం ఒక మంచి అడుగుగా భావించవచ్చు. ఈ కార్యక్రమం రాష్ట్రంలోని లక్షలాది రేషన్ కార్డుదారులకు లబ్ధి చేకూర్చనుంది. ఇక తెలంగాణ ప్రభుత్వం ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న అర్హులైన లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డుల పంపిణీని చేపట్టింది. జూలై 25 నుంచి ఆగస్టు 10 వరకు రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాల్లో ఈ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనితో పాటు, కొత్తగా కార్డులు పొందిన వారికి సెప్టెంబర్ నెల నుంచి రేషన్ సరుకులు అందించనున్నారు. జూలై 25 ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొత్త రేషన్ కార్డుల పంపిణీని ప్రారంభించారు. మొదటి దశలో.. 5.61 లక్షలకు పైగా కొత్త రేషన్ కార్డులను మంజూరు చేశారు. కొత్తగా కార్డులు పొందిన వారికి సెప్టెంబర్ నెల నుంచి రేషన్ బియ్యం మరియు ఇతర సరుకులు పంపిణీ చేయబడతాయి. జూన్ నెలలోనే మూడు నెలల కోటా బియ్యాన్ని పంపిణీ చేసినందున, జూలై, ఆగస్టు నెలలకు సరుకులు ఇవ్వలేదు. కొత్తగా మంజూరైన కార్డుల డిజైన్లు ఇంకా ఖరారు కానందున, ప్రస్తుతం సీఎం, మంత్రి ఉత్తమ్ ఫోటోలతో కూడిన మంజూరు పత్రాలను అందిస్తున్నారు. ఈ పత్రాలను చూపించి లబ్ధిదారులు సెప్టెంబర్ నుంచి రేషన్ తీసుకోవచ్చు. ప్రస్తుతం తెలంగాణలో సుమారు 96 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. వీటి ద్వారా సుమారు 3.10 కోట్ల మందికి సన్న బియ్యం సరఫరా అవుతోంది. కొత్తగా మంజూరైన కార్డులతో ఈ సంఖ్య మరింత పెరగనుంది. దీనితో పాటు, కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోవడానికి ఎలాంటి గడువు లేదని, అర్హత ఉన్నవారు ఎప్పుడైనా మీసేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు స్పష్టం చేశారు. ఈ కొత్త రేషన్ కార్డుల ద్వారా లబ్ధిదారులు ఆరు గ్యారెంటీ పథకాలైన ఆరోగ్యశ్రీ, గృహజ్యోతి వంటి వాటికి అర్హులు అవుతారు.

# నల్లగొండ జిల్లాలో నడిరోడ్డుపై గంజాయి బ్యాచ్ వీరంగం

నల్లగొండ : గంజాయిపై ఉక్కుపాదం మోపుతున్నామని కాంగ్రెస్ సర్కార్ ప్రగల్భాలు పలుకుతున్నప్పటికీ ఆచరణలో మాత్రం సాధ్యం కావడం లేదు. రాష్ట్రంలో రోజు రోజుకి గంజాయి బ్యాచ్ ఆగడాలు పెరిగిపోతున్నాయి. నల్గొండ జిల్లాలో నడి రోడ్డుపై గంజాయి బ్యాచ్ వీరంగం సృష్టించింది. తిప్పర్తిలో పోలీస్ స్టేషన్ పక్కనే ఉన్న సంజీవరెడ్డి అనే కుటుంబంపై.. గంజాయి మత్తులో యువకులు దాడి చేసి బీభత్సం



సృష్టించారు. తిప్పర్తి హైవేపై అటుగా వెళ్ళే ఆర్టీసీ బస్సుపైన దాడి చేశారు. అంతటితో ఆగకుండా ఓ లారీ మీదకు ఫోన్ విసిరికొట్టాడు. వేగంగా వెళ్తున్న వాహనాలకు అడ్డుగా వెళ్లి.. భయానక వాతావరణం సృష్టించారు. గంజాయి బ్యాచ్ వీరంగంతో స్థానికులు, వాహనదారులు భయభ్రాంతులకు గురయ్యారు. గంజాయి సేవించి.. దాడులకు పాల్పడుతున్నయువకులపైకఠిన తీసుకోవాలని స్థానికులు పోలీసులను డిమాండ్ చేస్తున్నారు.

# వ్యభిచార ముఠా అరెస్ట్

(హైదరాబాద్): సైబరాబాద్ పోలీసులు మరో అంతర్జాతీయ ముఠాకు చెక్ పెట్టారు. ఉజ్బెకిస్థాన్, తుర్క్మెనిస్థాన్ తో పాటు పలు రాష్ట్రాలకు చెందిన యువతులను వలలో వేసి, లగ్జరీ హోటళ్లలో వ్యభిచారం జరుపుతున్న రాకెట్‌ను మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం బృందం మాదాపూర్‌లో పట్టేసింది. మాదాపూర్ లోని బీఎస్ఆర్ సూపర్ లగ్జరీ హోటల్‌లో



సిబ్బంది సహకారంతో నడుస్తున్న ఈ వ్యభిచార దందాలో ఏడుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. తొమ్మిది మంది యువతులను రక్షించారు. నాంపల్లికు చెందిన హమీర్ సింగ్ అలియాస్ అమీద్ సింగ్ ఈ రాకెట్‌కు కీలక సూత్రధారి . అతడు నిఖిల్, సోనియాసింగ్, విశాల్ భయ్యా, శృతి, రోహిత్, రమేశ్ తదితరులతో కలిసి దేశీయ, విదేశీ యువతులను రప్పించి హోటల్ లో వ్యభిచారం నిర్వహిస్తున్నాడుఈ వ్యాపారం కోసం హోటల్ సూపర్‌వైజర్లు అయిన మహబూబ్ నగర్ కు చెందిన తమ్మి శ్రీనివాస్, కడపకు చెందిన కల వెంకటేశ్వర్లు తో ఒప్పందం కుదుర్చుకున్నారు. కస్టమర్ల కోసం వెబ్‌సైట్లలో ప్రకటనలు ఇస్తూ, గదులు బుక్ చేసి లావాదేవీలు జరుపుతున్నారు. సమాచారం అందుకున్న ఇన్‌స్పెక్టర్ బృందం హోటల్‌పై దాడి చేసి నిందితులను పట్టుకుంది. వీరిపై కేసులు నమోదు చేసి మాదాపూర్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు.


# ఫామ్‌హౌస్‌కు చేరుకున్న కవిత

సిద్ధిపేట, ఆగస్ట్ 15: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత తన కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం ఎర్రవల్లిలో తన తండ్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఫామ్ హౌస్‌కు చేరుకున్నారు. ఆమె చిన్న కుమారుడు ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లనున్నారు. ఈ నేపథ్యంలో అతడికి తన తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకునేందుకు కవితతోపాటు ఆమె కుటుంబ సభ్యులు ఫామ్ హౌస్‌కు చేరుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున తన కుమారుడితో కలిసి.. కవిత అమెరికాకు బయలుదేరి వెళ్లనున్నారు. 15 రోజుల పాటు కవిత అమెరికాలో ఉండనున్నారు. కుమారుడిని అమెరికాలో యూనివర్శిటీలో జాయిన్ చేసి.. కొన్ని రోజులు ఆమె అక్కడే ఉండి.. అనంతరం హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు. ఇప్పటికే కవిత పెద్ద కుమారుడు అమెరికాలో ఉన్నత విద్యను పూర్తి చేసుకున్న సంగతి తెలిసిందే. ఇక తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకున్న తర్వాత.. కవిత తన కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ బయలుదేరి



వెళ్లనున్నారు. మరోవైపు మాజీ సీఎం కేసీఆర్ పార్టీలోని కీలక నేతలకు ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు రావాలని ఆదేశించారు. దీంతో కేటీఆర్, హరీష్ రావులతోపాటు పలువురు కీలక నేతలు ఇప్పటికే ఎర్రవల్లికి పయనమయ్యారు. మరికొద్ది రోజుల్లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, స్థానిక సంస్థల ఎన్నికల అంశంపై చర్చించనున్నారు. ఈ ఎన్నికల్లో గెలుపు కోసం పార్టీ నేతలతో కేసీఆర్ సమావేశం కానున్నట్లు తెలుస్తుంది. అలాగే అసెంబ్లీ సమావేశాలు, కాళేశ్వరం ప్రాజెక్ట రిపోర్ట్ తదితర అంశాలపై చర్చించే అవకాశమున్నట్లు సమాచారం. బీఆర్ఎస్ పార్టీ స్థాపించి 25 ఏళు పూర్తయిన సందర్భంగా ఏప్రిల్‌లో వరంగల్ వేదికగా ఆ పార్టీ భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభ అనంతరం ఆ పార్టీ చీఫ్ కేసీఆర్‌కు ఆయన కుమార్తె కవిత లేఖ రాయడం.. ఆ లేఖ ఇటీవల బహిర్గతం కావడంతో.. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ పార్టీలకు ఆయుధం దొరికినట్లు అయింది. అంతేకాకుండా.. బీఆర్ఎస్ పార్టీలో లుకలుకలు ఈ లేఖ ద్వారా బహిర్గతమైనట్లు అయింది. దీంతో కవితతో కేసీఆర్, కేటీఆర్‌లు అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఒక ప్రచారం సైతం సాగుతోంది. అలాంటి వేళ.. కవిత శుక్రవారం ఎర్రవల్లిలోని తన తండ్రి ఫామ్‌హౌస్‌కు చేరుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది

# 79 మీటర్ల జాతీయ జెండాతో ఆకట్టుకున్న విద్యార్థుల ర్యాలీ



నెన్నెల : మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా తిరంగా జండా రెపరెపలాడింది. 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం కేంద్రంలో విద్యార్థులు 79 మీటర్ల భారీ జాతీయ జెండాతో వీధులలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రైవేట్ పాఠశాల లోటస్ విద్యార్థులు స్వతంత్ర దినోత్సవ నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. పలు పాఠశాలల్లో చిన్నారులు, స్వతంత్ర సమరయోధుల వేశాధారణ లో వేడుకల్లో పాల్గొని అలరించారు. మండలంలోని ఆయా గ్రామాలలో జాతీయ జెండాలను ఎగురా వేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు జెండాలను ఎగురవేసి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. స్వాతంత్ర్యం కోసం పోరాటాలు చేసిన మహనీయులను స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని వక్తలు పేర్కొన్నారు.

# అక్రమ సరోగసీ, ఎగ్ డొనేట్ చేస్తున్న వారిని అరెస్ట్ చేసిన మేడ్చల్ పోలీసులు



మేడ్చల్, ఆగస్టు 15 : అక్రమ సరోగసీకి పాల్పడుతున్న వ్యక్తుల్ని, ఎగ్ డొనేట్ చేస్తున్న వారిని అరెస్ట్ చేశామని మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి చెప్పారు. హైదరాబాద్‌లో ఏడుగురు మహిళలు, ఒక పురుషుడు మొత్తం 8 మంది కమర్షియల్ సరోగసీ, అక్రమ ఎగ్ ట్రేడింగ్ చేస్తూ పట్టుబడ్డారని డీసీపీ తెలిపారు. పిల్లలు లేని జంటలను టార్గెట్ గా చేసుకుని నిందితులు 15- 20 లక్షలు డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితురాలు నర్రెద్దుల లక్ష్మిరెడ్డి అలియాస్ లక్ష్మి గతంలో ఎగ్ డోనర్, సరోగసి మదర్‌గా పని చేసిన అనుభవం ఉందని .. గత అనుభవంతో సులభ పద్దతిలో డబ్బులు సంపాదించాలని అక్రమ సరోగసి విధానానికి తెరలేపి ఏజెంట్లుగా పనిచేస్తున్నారని డీసీపీ తెలిపారు. లక్ష్మీ రెడ్డి కుమారుడు 2 నిందితుడు నరేందర్ రెడ్డి లో కెమికల్ ఇంజనీరింగ్ చదివాడని, అమ్మకి తోడుగా ఈ వ్యాపారంలోకి దిగాడని డీసీపీ చెప్పారు. డబ్బు అవసరం ఉన్న పేద మహిళలను టార్గెట్ గా చేసుకుని ఎగ్ డొనేట్ చేయించడంతోపాటు, సరోగసికి ఒప్పిస్తున్నారని, నిందితుల దగ్గర నుంచి 6.47 లక్షల నగదు, లెనోవో ల్యాప్‌టాప్, ప్రామిసరీ నోట్లు, బాండ్ పేపర్లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. సిరంజీలు, గర్భధారణ మందులు, హార్మోన్ ఇంజెక్షన్లు, హెగ్డే హాస్పిటల్ కేస్ షీట్లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. వీళ్లిద్దరూ కొన్ని హాస్పిటల్స్ కు ఏజెంట్లకు పనిచేస్తున్నారని డీసీపీ తెలిపారు.


# దగ్గుపాటీ నోరు అదుపులో పెట్టుకో తేల్చుకుందాం రా

**- మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి**



**అనంతపురం:** "దగ్గుపాటీ.. నోరు అదుపులో పెట్టుకో. దమ్ము ధైర్యం ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిరా.. పోటీ చేద్దాం. ఎవరికి ఎన్ని ఓట్లు వస్తాయో చూద్దాం... అంటూ మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి సవాల్ విసిరారు. ఇంకా ఆయన మాట్లాడుతూ.. సమాధులను ఆక్రమించిన వాళ్లు, ఇతర పార్టీల నుంచి వచ్చిన వాళ్లు కూడా నన్ను పార్టీ నుంచీ సస్పెండ్ చేయాలని అడిగారని తెలిసింది.నువ్వు అర్ధరాత్రి టిక్కెట్ తెచ్చుకున్నా నేను కలిసి తిరిగాను. చంద్రబాబు సీఎం కావాలని కష్టపడ్డాను. నీ కోసం కాదు. ఇప్పుడు ప్రెస్‌మీట్ పెట్టి అవాకులు, చవాకులు పేలుతున్నావు. కష్టపడినోళ్లపై బురద చల్లుతావా? మున్సిపల్ చైర్మన్‌గా ఉన్నప్పుడు నేను అక్రమంగా ఆస్తులు సంపాయించానని అంటున్నావు. రా చర్చ పెట్టుకుందాం. నాకు ఎక్కడ అక్రమాస్తులు ఉన్నాయో లెటర్ ప్యాడ్‌పై రాసివ్వు.పార్టీ కోసం శ్రమించిన వాళ్లనే స్టేషన్లలో పోలీసుల చేత చితకబాదించింది నిజం కాదా? నీ దుర్నీతిపై ఆధారాలున్నా పార్టీ కోసం మౌనంగా ఉన్నాను. నా ఇంటిని బుల్డోజర్‌తో కొట్టిస్తానంటావా..? నేను తాలిబొట్లు తెంచానంటావా...? రాప్తాడు మర్డర్ కేసులో ముద్దాయి ఎవరు? సీపీఐ రామకృష్ణ మంచి భావాలున్న వ్యక్తి. ఆయనతో నేను మాట్లాడితే తప్పేంటి..? రాత్రి మందు తాగి మాట్లాడే వారెవరో అందరికీ తెలుసు.." అంటూ పేర్కొన్నారు.

# సూపర్ సిక్స్ సూపర్ హిట్: సీఎం చంద్రబాబు



**విజయవాడ, ఆగస్టు 15:** సూపర్ సిక్స్ అమలు చేస్తామంటే.. ఆనాడు ఎవరూ నమ్మలేదని.. ఇప్పుడు సూపర్ సిక్స్.. సూపర్ హిట్ అయిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. (శుక్రవారం) విజయవాడలో స్త్రీ శక్తి పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణాన్ని సీఎం చంద్రబాబు జెండా ఊపి ప్రారంభించే ముందు మాట్లాడారు. మహిళలకు ఆర్థిక స్వాతంత్రమే తమ లక్ష్యమన్నారు. ఆడబిడ్డల గౌరవం పెంచేందుకు ఎన్డీయే ప్రభుత్వం పని చేస్తోందని స్పష్టం చేశారు. ఆడబిడ్డలకు మంచి చేశామనే తృప్తి కలుగుతోందన్నారు. రాష్ట్రమంతా మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చని చెప్పారు. ఈ పథకం ద్వారా 2.64 కోట్ల మంది మహిళలకు లబ్ధి చేకూరుతుందన్నారు. ప్రజల ఆశీర్వాదం ఉన్నంత కాలం దూసుకెళ్తామన్నారు.ఏపీ పునర్నిర్మాణ దిశగా వేగంగా అడుగులు వేస్తున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. వైసీపీ పాలనలో ప్రజలు నవ్వడమే మర్చిపోయారని ఆయన వ్యంగ్యాస్త్రాలు సంధించారు. వైసీపీ పాలనలో ఇంటా, బయటా ప్రజలకు ఆనందం లేకుండా పోయిందని చెప్పుకొచ్చారు. వారి హయాంలో రోడ్డు మీదకు వస్తే తిరిగి క్షేమంగా ఇంటికి వెళ్తామన్న నమ్మకం ఉండేదా? అంటూ ఈ సందర్భంగా ప్రశ్నించారు. ఆడబిడ్డల జోలికి ఎవరైనా వస్తే తాట తీస్తానని హెచ్చరించారు. మహిళలను కించపరిచే వారిని వదిలిపెట్టేది లేదని కుండబద్దలు కొట్టారు. ఆడబిడ్డల భద్రత కోసం ప్రత్యేక చట్టం తెచ్చేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. మహిళా సాధికారత కోసమే డ్వాక్రా, మెప్మా సంఘాలు ఏర్పాటు చేశానన్నారు.ఆర్టీసీ కండక్టర్లుగా తొలుత మహిళలను తీసుకున్నది తామేనని ఈ సందర్భంగా చంద్రబాబు గుర్తు చేశారు. త్వరలో ఎలక్ట్రిక్ బస్సుల్లో మహిళలకు డ్రైవర్లుగా అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో 64 లక్షల మందికి పెన్షన్ ఇస్తున్నామని తెలిపారు. ఎంతమంది పిల్లలుంటే అంత మందికి 'తల్లికి వందనం' ఇస్తున్నామన్నారు. అయితే రాజకీయాల్లో ప్రజా చైతన్యం చాలా అవసరమని తెలిపారు. అలాగే రైతులకు అన్నదాత సుఖీభవ ఇస్తున్నామని వివరించారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల హామీని నెరవేరుస్తామని స్పష్టం చేశారు. ఇక ఆర్టీసీకి ఆదాయ మార్గాలు పెంచేందుకు చర్యలు సైతం చేపడుతున్నట్లు వివరించారు. ఇకపై ఎలక్ట్రిక్ బస్సులే కొంటామని.. అవి కూడా ఏసీ బస్సులేనని చెప్పారు. ఆటో డ్రైవర్లకు కూడా న్యాయం చేస్తామన్నారు. ఆటో డ్రైవర్లకు న్యాయం చేసేందుకు కేబినెట్ సబ్ కమిటీ వేశామన్నారు.వైసీపీ హయాంలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారంటూ ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సమయంలో గంజాయి, డ్రగ్స్ విచ్చలవిడిగా దొరికేవని గుర్తు చేశారు. ఏం చేసినా వెనక్కి లాగేందుకు చాలా మంది చూస్తున్నారన్నారు. అమరావతిని ఎడారి అన్నారని.. శ్మశానం అన్నారని సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. అమరావతిని గొప్ప నగరంగా తీర్చిదిద్దుతున్నామని స్పష్టం చేశారు. త్వరలోనే పోలవరం ప్రాజెక్టును సైతం పూర్తి చేస్తామని ప్రకటించారు. పులివెందులలో 30 ఏళ్ల తర్వాత అక్కడి స్థానికులు ఓటు హక్కు వినియోగించుకున్నారని చెప్పుకొచ్చారు. తద్వారా పులివెందుల ప్రజలకు నిజమైన స్వాతంత్రం వచ్చిందని సీఎం చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు.డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ..రాష్ట్రంలో మహిళల భద్రత కోసం పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. బస్సుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు సైతం చేపడుతున్నట్లు ఆయన వివరించారు. మహిళలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామన్నారు. సూపర్ సిక్స్ పథకాలను సమర్థంగా అమలు చేస్తున్నామని వివరించారు. ఉచిత బస్సు పథకం హామీని నెరవర్చగలమా? అని సందేహించామని.. కానీ సీఎం చంద్రబాబు కమిట్‌మెంట్‌కు ఈ పథకం అమలే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.'స్త్రీ శక్తి' పథకానికి 8,450 బస్సులు సిద్ధం చేశామని వివరిచారు. గత ప్రభుత్వ అస్తవ్యస్థ విధానాలతో ఆర్థిక వ్యవస్థ కుదేలైందని విమర్శించారు. ఆర్థిక వ్యవస్థను సరిచేస్తూ.. సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

# విధుల నుంచి ఎస్ఐ తొలగింపు



**శ్రీ సత్యసాయి బ్యూరో, ఆగస్టు 15 :** శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం నియోజకవర్గం ముదిగుబ్బ సర్కిల్ పరిధిలోని పట్నం ఎస్.ఐ రాజశేఖర్ ను పోలీస్ శాఖ నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు కర్నూలు రేంజ్ డీఐజీ ఆదేశాల మేరకు శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ వి.రత్న ఉత్తర్వులు జారీ చేశారు.న్యాయం కోసం పట్నం పోలీస్ స్టేషన్ కు వచ్చిన ఓ బాధిత మహిళను లైంగికంగా వేధించిన ఫలితంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయంలో పోలీస్ అధికారుల చొరవను జిల్లా ప్రజలు ప్రశంసిస్తున్నారు. ప్రధానంగా ఎస్ఐ రాజశేఖర్ మహిళా పట్ల వ్యవహరించిన తీరుపై స్పందించిన జిల్లా ఎస్పీ వి.రత్న ముందుగా ఎస్సైని వీఆర్ కు పంపుతూ ఆదేశాలు ఇచ్చారు. అనంతరం శాఖాపరంగా విచారణ జరిపి, విచారణలో ఎస్సై మహిళా పట్ల వ్యవహరించిన తీరు వాస్తవమని తేలడంతో ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు ఎస్సైని సర్వీస్ నుంచి తొలగిస్తూ ఉత్తరాలు జారీ చేయడం జరిగింది.

# మీరు గెలిస్తే ఒక న్యాయం ఓడితే మరో న్యాయమా వైసీపీపై పవన్ కల్యాణ్ ఫైర్



**విజయవాడ, :**గత పాలకుల సమయాన్ని డార్క్ సమయంగా చెప్పవచ్చని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. 2019 నుంచి 2024 వరకు బ్రిటీష్ పాలన మాదిరిగా సాగిందని విమర్శించారు. స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తితో పాలన కొనసాగిస్తున్నామని తెలిపారు. కాకినాడలో నిర్వహించిన 79వ స్వాతంత్ర్య దినోత్సవంలో తన సతీమణితో కలిసి పవన్ కల్యాణ్ పాల్గొన్నారు.రాష్ట్ర అభివృద్ధికి, పెట్టుబడులు రావాలంటే శాంతి భద్రతలు బలంగా ఉండాలని పవన్ కల్యాణ్ అన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణ, సుస్థిర పాలన కూటమి ప్రభుత్వ బాధ్యత అని తెలిపారు. గత ప్రభుత్వం చీకటి రోజులను స్వతంత్ర సమరయోధుల స్ఫూర్తితో ఎదుర్కొన్నామని తెలిపారు. దేశంలో అంతర్గత సుస్థిరత దెబ్బతీసేవారిపై ఓ కన్నుసి ఉంచాలని పిలుపునిచ్చారు. విదేశీ శక్తుల ఎజెండాను మోస్తున్న వారిపట్ల అప్రమత్తత అవసరమని పేర్కొన్నారు. అంతర్గత శత్రువులను ఓ కంట కనిపెట్టాలని సూచించారు.ప్రతిపక్ష నాయకులు ఓడిపోతే ఓటు చోరీ అంటున్నారని పవన్ కల్యాణ్ మండిపడ్డారు. గెలిచినప్పుడు ఒక న్యాయం.. ఓడినప్పుడు మరో న్యాయమా అని ప్రశ్నించారు. వైసీపీ పాలనలో గొంతెత్తితో దాడులు జరిగేవని ఆరోపించారు. అవినీతికి అలవాటుపడిన వాళ్లు ఏమైనా చేస్తారని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజలంతా స్వేచ్ఛగా ఉన్నారని చెప్పారు. పోర్టు ప్రాంతం, తీర ప్రాంతాల్లో గస్తీని బలంగా ఉంచుతామని పేర్కొన్నారు.కాకినాడలో డీజిల్ అక్రమ రవాణా జరుగుతుందని పవన్ కల్యాణ్ తెలిపారు. బియ్యం, డీజిల్ అని వదిలేస్తే తీర ప్రాంతం నుంచి మారణాయుధాలు, బాంబులు తీసుకొస్తారని హెచ్చరించారు. అందుకే తీర ప్రాంతాల్లో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# బనకచర్ల ప్రాజెక్ట్ పై సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు



**విజయవాడ, ఆగస్టు 15:** పంద్రాగస్టు వేడుకల్లో బనకచర్లపై సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. బనకచర్లతో ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగదని స్పష్టం చేశారు. బనకచర్లపై ఎవరూ అభ్యంతరం చెప్పాల్సిన అవసరం లేదని.. సముద్రంలోకి వృథాగా పోయే నీటినే వాడుకుంటాం అని అన్నారు. ఎగువ రాష్ట్రాల వరద నీటితో నష్టాలనూ భరిస్తున్నామని.. అదే వరద నీటిని వాడుకుంటామంటే అభ్యంతరమేంటి? అని పరోక్షంగా తెలంగాణ సర్కార్‌కు ప్రశ్నను సంధించారు. వరదను భరించాలి కానీ ఆ నీటిని వాడుకోవద్దా? అని నిలదీశారు. కాగా రాయలసీమను నీటితో సశ్యశామలంగా చేసేందుకు బనకచర్ల ప్రాజెక్ట్ ను నిర్మిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటన చేసిన సంగతి తెలిసిందే . అయితే దీనికి తెలంగాణ సర్కార్ నో చెప్పడంతో వివాదం రాజుకుంది.కఠిన చర్యలు ఉంటాయి..మహిళలను సోషల్ మీడియాలో వేధించేవారిపై కఠిన చర్యలు ఉంటాయని అన్నారు సీఎం. రేషన్ బియ్యం రిసైక్లింగ్ మాఫియాకు అడ్డుకట్ట వేశామన్నారు. 2027 డిసెంబర్ నాటికి పోలవరం పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామని చెప్పారు. రాయలసీమలో సాగునీరు అందించే పై గత ప్రభుత్వ నాటకం ఆడిందని మండిపడ్డారు. తాము అధికారంలోకి రాగానే 3,850 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామన్నారు. వెలిగొండ ప్రాజెక్టుకు ప్రాధాన్యం ఇస్తూ 2026 జులై నాటికి నీరు ఇస్తామని తెలిపారు. రాయలసీమను సస్యశ్యామలం చేసేందుకు పోలవరం నుంచి బనకచర్లకు నీరు అందిస్తాం అని ప్రకటన చేశారు. మిగులు జలాలను, వరద నీటిని ఉపయోగించుకుంటామని.. వరదను బరించాలి అయితే వాటిని వాడకూడదు అంటే అని ప్రశ్నించారు. 785టిఎంసి నీళ్లు వివిధ రిజర్వాయర్ లలో నిల్వ ఉన్నాయని అన్నారు

# ఆవకాయ పెట్టాలన్నా అంతరిక్షంలోకి వెళ్లాలన్నా

**విజయవాడ, ఆగస్టు 15:**

ఆవకాయ పెట్టాలన్నా.. అంతరిక్షంలోకి వెళ్లాలన్నా.. అది మహిళలతోనే సాధ్యమవుతుందని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. మహిళలు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారని పేర్కొన్నారు. శుక్రవారం స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా స్త్రీ శక్తి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తోపాటు మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. అద్భుతాలన్నీ మహిళలతోనే సాధ్యమవుతాయన్నారు.మహిళలకు ప్రత్యేక వర్సిటీ ఏర్పాటు చేసిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతోందని గుర్తు చేశారు. మహిళలకు సాధికారత కల్పించిన ఘనత సీఎం చంద్రబాబు నాయుడేదని కొనియాడారు. కొంత మంది మహిళలను కించపరిచేలా మాట్లాడుతున్నారంటూ వైసీపీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు లోకేష్. అసెంబ్లీ సాక్షిగా తన తల్లిని అవమానించారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. సొంత చెల్లితో రాఖీ కట్టించుకోని అన్న.. మహిళల గురించి మాట్లాడుతున్నారంటూ వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మండిపడ్డారు.మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే తోలు




తీస్తామని హెచ్చరించారు మంత్రి లోకేష్. గతంలో మద్యపాన నిషేధం చేస్తానని ఓ రాక్షసుడు చెప్పాడన్నారు. కానీ.. జే బ్రాండ్స్ తీసుకొచ్చి ప్రజల ప్రాణాలు తీశారంటూ గత వైసీపీ ప్రభుత్వంపై మండిపడ్డారు. తల్లి, చెల్లిని పట్టించుకోని వ్యక్తి.. ఇతర మహిళలకు న్యాయం చేస్తారా? అంటూ ఆయన సందేహం వ్యక్తం చేశారు. తల్లి మీద కేసు గెలిస్తే.. సంబరాలు చేసుకున్నారంటూ జగన్‌పై మంత్రి లోకేష్ నిప్పులు చెరిగారు. తల్లి, చెల్లికి న్యాయం చేశాకే తన గురించి మాట్లాడాలని వారిని కోరుతున్నానంటూ వైసీపీ అగ్రనాయకత్వానికి లోకేష్ కియర్ కట్‌గా స్పష్టం చేశారు.భూమి కంటే ఎక్కువ భారం మోసేది మహిళలేనన్నారు. మహిళల అభ్యున్నతికి పాటు పడుతున్నది టీడీపేనేనని పేర్కొన్నారు. మహిళలకు ఆస్తిలో సగం వాటా అమలు చేసింది కూడా టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆరే అని గుర్తు చేశారు. మహిళల పేరిట ఇళ్ల పట్టాలు, సంక్షేమ పథకాలు అమలు చేసింది సీఎం చంద్రబాబేనని చెప్పారు. చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేసిందీ సీఎం చంద్రబాబే అని వెల్లడించారు. మహిళలను అన్ని విధాలా అభివృద్ధి చేసేలా చంద్రబాబు చర్యలు తీసుకున్నారని వివరించారు. మహిళలను కించ పరిచేలా సీరియళ్లు, చిత్రాలు రాకుండా చట్టాన్ని తీసుకురావాలని తాను ప్రభుత్వాన్ని కోరుతున్నానన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా సాధికారతకు ఉచిత బస్సు ప్రయాణం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఇవ్వడమే కానీ.. తీసుకోవడం తెలియని గొప్ప వారు మహిళలని ఈ సందర్భంగా ఆయన అభివర్ణించారు. స్త్రీలకు ఎంతగానో ఉపయోగపడే పథకాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభిస్తున్నారని కొనియాడారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు కొత్త ఒరవడిని ప్రారంభించారన్నారు. ప్రజలు ఆనందంగా ఉంటే చాలు.. అదే కోటి వరాల జల్లు అని సీఎం చంద్రబాబు భావిస్తారని తెలిపారు. హ్యాపినెక్స్ట్ ఇండెక్స్‌ను అమలు చేస్తున్నది సీఎం చంద్రబాబేనని ఈ సందర్భంగా మాధవ్ ప్రశంసించారు.

# భక్తుల రద్దీకి అనుగుణంగా శ్రీశైలం ఆలయంలో సౌకర్యాలు : ఈవో శ్రీనివాస రావు



**నంద్యాల :** శ్రీశైలం మల్లికార్జున స్వామి ఆలయానికి రోజురోజుకు పెరుగుతున్న భక్తుల తాకిడికి అనుగుణంగా పలు సౌకర్యాలను కల్పిస్తున్నామని ఆలయ ఈవో శ్రీనివాస్ రావు వెల్లడించారు. 79వ స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా ఆలయ కార్యాలయ భవనం ఎదుట మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతోమంది దేశభక్తులు, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగా లభించిన స్వేచ్ఛ స్వాతంత్ర్యాలను నేడు అనుభవిస్తున్నామని పేర్కొన్నారు. ఆలయంలో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడంతో పాటు క్షేత్రాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.నందికొట్కూర్‌కు చెందిన సాయిలిక్షిత శ్రీ ప్రదర్శించిన దేశభక్తి గేయాల సంప్రదాయ నృత్యం ఆకట్టుకుంది. శ్రీశైలం ఒకటవ టౌన్‌లో సీఐ ప్రసాదరావు జెండాను ఎగురవేసి సిబ్బంఇకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది, శివసేవకులు, ఎస్పీఎఫ్, హెూంగార్డు సిబ్బంది పాల్గొన్నారు.

# డ్రైవర్‌గా మారి.. ఆర్టీసీ బస్సు నడిపిన నందమూరి బాలకృష్ణ



**హిందూపురం:** ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ మరోసారి వార్తల్లో నిలిచారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభోత్సవ ంలో భాగంగా హిందూపురంలో ఆర్టీసీ బస్సును నడిపారు.ఏపీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకానికి సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శ్రీకారం చుట్టారు. విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్త్రీశక్తి పథకాన్ని ప్రారంభించారు. హిందూపురంలో బాలకృష్ణ ఈ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా హిందూపురం బస్టాండ్ నుంచి బాలయ్య క్యాంప్ ఆఫీసు వరకు ఆర్టీసీ బస్సును డ్రైవ్ చేశారు. బస్సులో మహిళా ప్యాసింజర్లను కూర్చోబెట్టుకుని రెండు కిలోమీటర్ల మేర బస్సు నడిపించారు.ఇదిలా ఉంటే, స్త్రీశక్తి పథకం ప్రారంభానికి ముందు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం ప్రయాణించారు. ఉండవల్లి గుహల వద్ద నుంచి తాడేపల్లి, కనకదుర్గ వారధి మీదుగా విజయవాడ సిటీ టెర్మినల్ వరకు ప్రయాణించారు. బీజేపీ ఏపీ అధ్యక్షుడు మాధవ్ కూడా ఆ ఆర్టీసీ బస్సులోనే వెళ్లారు. కాగా ఉచిత బస్సు పథకం ప్రారంభం నేపథ్యంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు హడావుడి చేశారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన మార్గం బాణసంచా కాల్చారు. తీన్మార్ డ్యాన్సులతో హంగామా చేశారు

# ఎమ్మెల్యే దగ్గుపాటి ఆసక్తికర కామెంట్స్ నాకు ఆ రాజకీయం తెలియదు

**అనంతపురం:** "రైతు కుటుంబం నుంచి వచ్చిన నాకు అభివృద్ధి తప్ప రాజకీయాలు చేయడం తెలియదు. సీఎం చంద్రబాబు ఆశీర్వాదం, మా యువనేత లోకేశ్ సహకారంతో ఎమ్మెల్యే అయ్యానని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. ఆయన మాట్లాడుతూ.. నేను వచ్చినప్పటి నుంచి కుట్రలు చేస్తున్నారు. మళ్లీ నాకే ఎక్కడ టిక్కెట్ ఇస్తారోనన్న భయంతో పార్టీ లైన్‌లో ఉన్న మరో నాయకుడు బురద చల్లుతున్నారు.ఎంతటి సీనియర్లు అయినా క్రమశిక్షణ తప్పితే చర్యలు ఖాయం. నేను తప్పుచేయను. చేస్తే తలవంచుతాను. పార్టీ నిర్ణయమే నాకు శిరోధార్యం. నగరంలో ఏడాది కాలంలో రూ.122 కోట్లతో అభివృద్ధి చేశాను. రూ.750 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం డీపీఆర్ పంపాము. 30 ఏళ్ల డంపింగ్ యార్డ్ సమస్యను క్లియర్ చేయిస్తున్నాము. మూడు వేల టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నాము.



సీపీఐ రామకృష్ణ నాకు బాగా తెలుసు. ఆయన ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదివినట్లున్నారు. ఎమ్మెల్యే అయ్యాక బంధువుల పేరిట, నా పేరిట సెంటు భూమి కొనలేదు.గతంలో సుగుణ చికెన్ దుకాణాల్లో వసూళ్లు అంటూ యల్లనూరు, పుట్లూరు వ్యక్తుల పేరుతో వాయిసలు బయటకొచ్చాయి. ఆ ప్రాంతంలో ఎవరికి బాగా పరిచయాలు ఉన్నాయో అందరికీ తెలుసు. అస్త్ర ఆసుపత్రి ఘటనపై రాంనగర్‌లో ఉండే శ్రీనివాస్ చౌదరి కొందరు మీడియా వాళ్లను జడ్పీలోకి తీసుకెళ్లి బలవంతంగా మా వాళ్ల పేర్లు చెప్పించే ప్రయత్నం చేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశాం. డబుల్ రిజిస్ట్రేషన్ వ్యవహారంపై సబ్ రిజిస్ట్రార్‌ను విచారించాలని జిల్లా రిజిస్ట్రార్‌ను కోరాము. భూ కబ్జాలు చేయాల్సిన అవసరం నాకు లేదు.నా వద్దే వెయ్యిమంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. నా బావమరిది అశోక్‌పై కూడా విమర్శలు చేస్తున్నారు. గతంలో రహంతుల్లా, మహాలక్ష్మి శ్రీనివాస్ ఎలా ఓడిపోయారో అందరికీ తెలుసు. ఇలాంటి రాజకీయాలు చేయడం నాకు తెలియదు. ఆ నాయకుడి అనుభవమంత వయస్సు కూడా నాకు లేదు. మంచి కోసం ఆయన సలహాలు ఇస్తే తీసుకుంటాను. 14 నెలలుగా నాపై

# ఆసియా కప్ కోసం సెలక్షన్ తిప్పలు

టీ20 జట్టులో టెస్టు సారథి సెట్ అవుతాడా శాంసన్‌పై వేటు తప్పదా19న జట్టును ప్రకటించే అవకాశం ముంబై వచ్చే నెలలో యూఏఈ వేదికగా జరగాల్సి ఉన్న ఆసియా కప్‌నకు జట్టును ఎంపిక చేసేందుకు గాను సెలక్టర్లకు సెలక్షన్ తిప్పలు తప్పడం లేదు. ఈనెల 19న అజిత్ అగార్కర్ నేతృత్వంలోని ఆలిండియా సెలక్షన్ కమిటీ.. ఆసియా కప్‌లో పాల్గొనబోయే భారత జట్టును ప్రకటించనుంది. ఈ నేపథ్యంలో జట్టులో ఎవరుంటారు? ఎవరిపై వేటు పడొచ్చు? అన్న చర్చ నడుస్తున్నది. ముఖ్యం గా ఫార్మాట్‌కు ఒక్కో కెప్టెన్ విధానానికి వ్యతిరేకమైన బీసీసీఐ.. దానికి చెక్ పెట్టేందుకు గాను ఇప్పటికే టెస్టు పగ్గాలు అందుకున్న శుభ్‌మన్ గిల్‌కూ పొట్టి ఫార్మాట్ సారథ్య బాధ్యతలు అప్పజెప్పాలన్న భావనలో ఉన్నట్టు బోర్డు వర్గాల వినికిడి. ఈ క్రమంలో అతడిని ఆసియా కప్ కోసం సూర్యకుమార్ యాదవ్‌కు డిప్యూటీగా నియమి ంచనున్నట్టు గత కొన్నిరోజులుగా పుకార్లు షికార్లు చేస్తున్నాయి.ప్రస్తుతం టీ20 జట్టుకు సూర్య సారథి కాగా అక్షర్ పటేల్ వైస్ కెప్టెన్‌గా ఉన్నాడు. అయితే గిల్ టీ20 జట్టులోకి వస్తే ఓపెనర్ సంజూ శాంసన్ పరిస్థితి ఏంటన్నది ప్రశ్నార్థకం. ఈ ఫార్మాట్‌లో శాంసన్, అభిషేక్ శర్మ గడిచిన ఏడాదికాలంగా నిలకడగా రాణిస్తున్నారు. మరి ఈ జోడీని విడదీసి



సెలక్టర్లు.. అభిషేక్‌కు జతగా గిల్‌ను పంపిస్తారా అనేది చర్చనీయాంశంగా మారింది. సంజూకు గిల్‌తో పాటు వికెట్ కీపర్ బ్యాటర్ జితేశ్ శర్మతోనూ తీవ్ర పోటీ నెలకొంది. ఈ ఏడాది ఐపీఎల్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు మిడిలార్డర్‌లో అతడు ఉపయుక్తకరమైన బ్యాటర్. ఆల్‌రౌండర్ల విషయంలోనూ సెలక్టర్లకు తిప్పలు తప్పడం లేదు. హార్దిక్ పాండ్యా, నితీశ్ కుమార్ రెడ్డి, శివమ్ దూబే, వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్‌లో ఎవర్ని ఆడిస్తారనేది ఆసక్తికరం. ఇక ఇంగ్లండ్‌తో మూడు టెస్టులు ఆడిన బుమ్రా.. ఆసియా కప్‌లో ఆడతాడా? లేదా? అన్నదానిపై ఇంకా అనిశ్చితి కొనసాగుతున్నది.

# నా ప్రియశిష్యుడు నేను కోచింగ్ ఇచ్చిన అత్యుత్తమ ఆటగాడు అతడే

భారత క్రికెట్‌లో తొలి వరల్డ్ కప్ హీరో అయిన రవి శాస్త్రి ఆపై కోచ్‌గా చెరగని ముద్ర వేశాడు. తన మార్గనిర్దేశనంలో జట్టును నంబర్ 1గా నిలిపాడీ వెటరన్ ప్లేయర్. ప్రస్తుతం కామెంటేటర్‌గా అభిమానులను రంజింపజే స్తున్న శాస్త్రి తన దగ్గర కోచింగ్ తీసుకున్న వాళ్లలో అత్యుత్తమ ఆటగాడి పేరును వెల్లడిం చాడు. అతడు ఎవరో కాదు.. విరాట్ కోహ్లీ. పరస్పర అవగాహనతో అద్భుతమైన ఫలితాలు రాబట్టిన వీరిద్దరిది నాలుగేళ్ల సావాసం. ఇంతకూ రవి శాస్త్రి రన్ మెషీన్ విరాట్‌నే ఎందుకు తన బెస్ట్ ఛాయిస్‌గా ఎంచుకున్నాడో తెలుసా..'నేను జాతీయ జట్టుక కోచ్‌గా పనిచేసిన రోజుల్లో కోహ్లీ అసాధారణంగా కనిపించేవాడు. మైదానంలో చిరుతలా కదిలే అతడు ప్రత్యర్థిపై ఆధిపత్యం చెలాయించాల నుకుంటాడు. ముఖాముఖి ఎదురుపడినా ఏమాత్రం వెనక్కి తగ్గడు. మెరుగైన ప్రదర్శన చేసేందుకు చాలా కష్టపడతాడు. కానీ, చాలా చక్కని షాట్లతో అలరిస్తాడు' అని స్కై స్పోర్ట్స్ యూట్యూబ్ ఛానెల్లో శాస్త్రి తన డియరెస్ట్ ప్లేయర్ కోహ్లీపై ప్రశంసలు కురిపిం చాడు.'కెప్టెన్‌గా విరాట్ గొప్పగా రాణించడంలో రవి శాస్త్రి పాత్ర చాలానే ఉంది. అతడి సలహాలు, సూచనలతో ఆటగాడిగా, సారథిగా కోహ్లీ ఎదురులేని శక్తిగా అవతరించాడు. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ.. 'కోహ్లీ అద్భుతమైన ప్లేయర్. మేమిద్దరం ఐదేళ్లలో జట్టును టెస్టుల్లో



నంబర్ 1గా నిలిపాం. బ్యాటర్‌గా విరాట్ సాధించిన ఘన తలు చాలానే. ముఖ్యంగా ఆస్ట్రేలియా, దక్షిణా ఫ్రికా, ఇంగ్లండ్ పర్యటనలో విరాట్ ఆడిన తీరు.. ముందుండి జట్టును నడిపించిన విధానం వర్ణణాతీతం అందుకే.. నేను కోచింగ్ ఇచ్చిన వాళ్లలో అత్యుత్తమ ఆటగాడిగా కోహ్లని ఎంపిక చేశాను. కెప్టెన్సీకి అవసరమైన అన్ని లక్షణాలు ఉన్నందునే ధోనీ వారసుడిగా విరాట్‌కు పగ్గాలు అప్పగించాలని నేను సూచించాను' అని శాస్త్రి వెల్లడించాడు. 2017 నుంచి 2021 వరకూ ఈ మాజీ ప్లేయర్ భారత జట్టుకు హెడ్‌కోచ్‌గా సేవలందిం చాడు.18 శతకాలుధోనీ నుంచి 2014లో టెస్టు పగ్గాలు అందుకున్న విరాట్.. ఆస్ట్రేలియా పర్యటనలో రెండు సెంచరీలతో నాయకుడిగా తన చేవను చాటాడు. ఆ తర్వాతి ఐదేళ్లు రెడ్ బాల్ క్రికెట్‌లో శతకాలతో.. పరుగుల వరదతో ప్రకంపనాలు సృష్టించాడీ స్టార్. ఈ కాలంలో 63.27 సగటుతో 4,492 రన్స్ కొట్టిన కోహ్లీ 18 శతకాలు సాధించాడు. అదే జోరు కొనసాగిస్తాడనుకుంటే 2021 తర్వాత టచ్ కోల్పోయాడు. మూడేళ్ల తర్వాత ఆస్ట్రేలియాపై సెంచరీతో మళ్లీ ఫామ్‌లోకి వచ్చాడు కింగ్. టీ20 వరల్డ్ కప్ గెలుపొందిన అనంతరం పొట్టి ఫార్మాట్‌ను వీడిన కోహ్లీ టెస్టులకు వీడ్కోలు పలికాడు. ఇంగ్లండ్‌లో ఐదు టెస్టుల సిరీస్‌కు ముందే రిటైర్మెంట్ ప్రకటించి అందర్నీ షాక్‌లో ముంచెత్తాడు

# నేను దీన్ని చాలా ద్వేషిస్తున్నాను

నేను దీన్ని చాలా ద్వేషిస్తున్నాను.. పంత్ పోస్ట్ వైరల్.: టీమిండియాకు గిఫ్టెడ్ ప్లేయర్‌లా దొరికిన పంత్ ప్రస్తుతం గాయం నుంచి వేగంగా కోలుకుంటున్నాడు. తాజాగా తన రికవరీపై అప్‌డేట్ ఇచ్చాడీ చిచ్చరపిడుగు. సుదీర్ఘ ఫార్మాట్‌లో సూపర్ స్టార్ అనిపి ంచుకుంటున్న భారత క్రికెటర్ రిషభ్ పంత్ మైదానంలో ఉన్నాడంటే ఆ సందడే వేరు. బ్యాట్‌తో ప్రత్యర్థుల భరతం పట్టే అతడు.. వికెట్ల వెనకాల చురుగ్గా కదులుతూ 'వారెవా' అనిపిస్తాడు. టీమిండియాకు గిఫ్టెడ్ ప్లేయర్‌లా దొరికిన పంత్ ప్రస్తుతం గాయం నుంచి వేగంగా కోలుకుంటున్నాడు. తాజాగా తన రికవరీపై అప్‌డేట్ ఇచ్చాడీ చిచ్చరపిడుగు. ఇంగ్లండ్ గడ్డపై చివరి టెస్టుకు, కొన్ని రోజులు ఆటకు తనను దూరం చేసిన పాదం గాయం ఏమాత్రం తనకు నచ్చడం లేదని ఇన్‌స్టాగ్రామ్ లో పోస్ట్ పెట్టాడీ డాషింగ్ బ్యాటర్. గురువారం పంత్ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో 'నేను దీన్ని చాలా ద్వేషిస్తున్నాను' అంటూ పట్టీతో ఉన్న తన కుడి పాదం ఫొటోను పంచుకున్నాడీ వైస్ కెప్టెన్. అతడి పోస్ట్ చూసిన అభిమానులు పంత్.. వి మిస్ యూ.. నువ్వు త్వరగా కోలుకోవాలి అంటూ కామెంట్లు పెడుతు న్నారు.మాంచెస్టర్ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో క్రిస్



వోక్స్ బంతిని స్వీప్ షాట్ ఆడబోయి గాయపడ్డాడు పంత్. మెరుపు వేగంతో వచ్చిన ఆ బంతి అతడి కుడి పాదం చివరి వేళ్లకు బలంగా తాకడంతో నొప్పితో విలవిలలాడు. ఫిజియో వచ్చి పరీక్షించాక రిటైర్డ్ హర్ట్‌గా డగౌట్ చేరిన పంత్.. శార్దూల్ ఠాకూర్ వికెట్ పడ్డాక కుంటుతూనే క్రీజులోకి వచాడు. టెయిలెండర్ల సాయంతో స్కోర్ బోర్డును నడిపించిన పంత్.. కార్సే ఓవర్లో సిక్సర్ బాది.. హాఫ్ సెంచరీతో జట్టును ఆదుకున్నాడు. వైద్య పరీక్షల తర్వాత ఎముక విరిగిందని తెలిసినా టీమ్ కోసం మైదానంలోకి దిగిన అతడు.. రెండో ఇన్నింగ్స్‌లోనూ ఆడేందుకు సిద్ధమయ్యాడు. పంత్ సంచరీ అభివాదం. కానీ.. జడేజా, సుందర్‌లు అజేయ శతకాలతో మ్యాచ్‌ను డ్రాగా ముగించారు. అయితే.. గాయం తీవ్రత కారణంగా పంత్ చివరిదైన ఓవల్ టెస్టుకు దూరమయ్యాడు. ఇంగ్లండ్ గడ్డపై తనదైన శైలిలో దుమ్మురేపిన ఈ విధ్వంసక బ్యాటర్ హెడింగ్లే టెస్టు రెండు ఇన్నింగ్స్‌ల్లో సెంచరీలతో చరిత్ర సృష్టించాడు. మొత్తంగా అండర్సన్ %-% టెండూల్కర్ ట్రోఫీలో ఇంగ్లండ్ బౌలర్లకు చుక్కలు చూపించి 479 పరుగులతో రాణించాడు.

# భారత్‌కు విచ్చేస్తున్న ఫుట్‌బాల్ మాంత్రికుడు

భారత్‌లోని క్రీడాభిమానులకు గుడ్‌న్యూస్. ఫుట్‌బాల్ మాంత్రికుడు క్రిస్టియానో రొనాల్డో త్వరలోనే ఇండియాకు వస్తున్నాడు. తన ఆటతో మన ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతు న్నాడీ లెజెండ్. ఏఎఫ్‌సీ ఛాంపియన్స్ లీగ్ మ్యాచ్ కోసం ఈ స్టార్ ఫార్వర్డ్ మనదేశం రానున్నాడు. శుక్రవారం ఆసియా ఫుట్‌బాల్ సంఘం లీగ్ డ్రాలను ప్రకటించింది.మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లోని ఏఎఫ్‌సీ హౌస్‌లో ఏఎఫ్‌సీ ఛాంపియన్స్ లీగ్ 2025-26 సీజన్ డ్రా తీశారు. రొనాల్డో సారథ్యం వహిస్తున్న అల్



నస్రీ క్లబ్ గ్రూప్ డీలో ఉంది. అదే గ్రూప్‌లో ఇండియన్ సూపర్ లీగ్‌కు చెందిన ఎఫ్‌సీ గోవా జట్టు కూడా ఉండడంతో ఈ వెటన్ ప్లేయర్ రాక అనివార్యం కానుంది.గ్రూప్ డీలో ఎఫ్‌సీ గోవా, అల్ జవ్రా ఎఫ్‌సీ (ఇరాక్), ఎఫ్‌సీ ఇస్తిక్లోల్(తజకిస్థాన్) జట్లు ఉన్నాయి. రొనాల్డో కెప్టెన్సీలో అద్భుత విజయాలు సాధిస్తున్న అల్ నస్రీ క్లబ్ సౌదీ ప్రో లీగ్‌లో మూడో స్థానంతో ఈ లీగ్‌కు అర్హత సాధించింది. ఐఎస్ఎల్ 2024/25 లీగ్ సీజన్‌లో గోవా టీమ్ రెండో స్థానంలో నిలిచింది. మే నెలలో సూపర్ కప్‌లో విజేతగా నిలిచి ప్లే ఆఫ్స్ రేసులోకి దూసుకొచ్చింది గోవా. అదే జోష్‌తో ఒమన్‌కు చెందిన అల్ సీబ్ జట్టును ఓడించి ఏఎఫ్‌సీ లీగ్‌లో ఆడే అవకాశం దక్కించుకుంది.

# వాణిజ్య లోటు పైపైకి గత నెల 8 నెలల గరిష్ఠానికి చేరిక

జూలైలో 27.35 బిలియన్ డాలర్లుగా నమోదుదేశ దిగుమతుల్లో ఎగుమతులు దాదా పు సగానికి పరిమితం తాజా అధికారిక గణాంకాల్లో వెల్లడి దేశంలో ఎగుమతులు, దిగుమ తుల మధ్య వ్యత్యాసానికి సూచికగా ఉండే వాణిజ్య లోటు గత నెలలో ఏకంగా 8 నెలల గరిష్ఠాన్ని తాకింది. గురువారం విడుదలైన కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ అధికారిక గణాంకాల ప్రకారం జూలైలో భారత వాణిజ్య లోటు 27.35 బిలియన్ డాలర్లుగా నమోదైంది. గత ఏడాది నవంబర్ తర్వాత ఇదే అత్యధికం కావడం గమనార్హం. నాడు 31.77 బిలియన్ డాలర్లుగా వాణిజ్య లోటు ఉన్నది. జూలైలో దేశంలోకి ఆయా దేశాల నుంచి వచ్చిన దిగుమతుల్లో.. మన దేశం నుంచి వివిధ దేశాలకు వెళ్లిన ఎగుమతులు దాదాపు సగానికే పరిమితమయ్యాయి మరి.ఇదీ సంగతి దేశీయ ఎగుమతులు గత నెలలో 37.24 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. దీంతో గతంతో పోల్చితే 7.29 శాతం వృద్ధి కనిపిస్తున్నది. నిజానికి అంతకుముందు రెండు నెలలూ ఎగుమతులు పడిపోయాయి. అయితే జూలైలో పుంజుకున్నాయి. మరోవైపు దేశంలోకి దిగుమతుల విలువ 64.59 బిలియన్ డాలర్లుగా ఉన్నది. మునుపటితో చూస్తే 8.6 శాతం పెరిగింది. అందుకే వాణిజ్య లోటు ఇంతలా ఎగిసిందని మార్కెట్ నిపుణులు ప్రస్తుత పరిస్థితిని విశ్లేషిస్తున్నారు. కాగా, దేశంలో అన్ని రకాల వస్తూత్పత్తుల తయారీ పెరిగితే.. దిగుమతుల్ని తగ్గించుకోవచ్చని, తద్వారా విదేశీ మారకపు నిల్వలను కాపాడుకోవచ్చని అంటున్నారు. అలాగే ప్రస్తుతం అమెరికా టారిఫ్‌ల దృష్ట్యా ఆయా దేశాలకు ఎగుమతుల్ని పెంచుకోవడానికున్న అవకాశాలను అన్వేషించాలని కూడా కేంద్ర




ప్రభుత్వానికి వారు సూచిస్తున్నారు. ఫలితంగా వాణిజ్య లోటును కట్టడి చేయవచ్చని, డాలర్ల రాకనూ పెంచుకోవచ్చని సలహా ఇస్తున్నారుఏప్రిల్-జూలైలో.. ఆర్థిక సంవత్సరం (2025-26) తొలి 4 నెలల్లో (ఏప్రిల్-జూలై) దేశ ఎగుమతులు 3.07 శాతం పెరిగి 149.2 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. అయితే ఇదే సమయంలో దిగుమతులు 5.36 శాతం ఎగిసి 244.01 బిలియన్ డాలర్లుగా నమోదు కావడం గమనార్హం. దీంతో వాణిజ్య లోటు 94.81 బిలియన్ డాలర్లుగా ఉన్నది. కాగా, దేశ ఎగుమతుల ప్రోత్సాహానికి తీసుకోవాల్సిన చర్యలను త్వరలోనే ప్రకటిస్తామని ఈ సందర్భంగా కేంద్ర వాణిజ్య కార్యదర్శి సునీల్ భరత్‌వాల్ అన్నారు.అమెరికాతో ఇలా..ఈ జూలైలో అమెరికాకు భారత్ నుంచి వెళ్లిన ఎగుమతుల్లో 19.94 శాతం వృద్ధి కనిపిస్తున్నది. గత నెల అగ్రరాజ్యానికి 8.01 బిలియన్ డాలర్ల ఎగుమతులు జరిగాయి. అలాగే అమెరికా నుంచి మన దేశానికి దిగుమతులు 13.78 శాతం పెరిగి 4.55 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూలైలో అమెరికాకు భారత ఎగుమతులు 21.64 శాతం పెరిగి 33.53 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. అమెరికా నుంచి దిగుమతులు 12.33 శాతం ఎక్కువై 17.41 బిలియన్ డాలర్లకు చేరాయి. కాగా, ఈ ఆర్థిక సంవత్సరం మొదలు (ఏప్రిల్ నుంచి) అమెరికాకు భారత ఎగుమతులు నెలనెలా పెరుగుతూనే ఉన్నాయి. అయితే ఈ నెల (ఆగస్టు) నుంచి పడిపోవచ్చన్న అంచనాలున్నాయి. అమెరికాలోకి దిగుమతయ్యే భారతీయ వస్తూత్పత్తులపై ట్రంప్ విధించిన సుంకాలే ఇందుకు కారణం. సెప్టెంబర్‌లో ఇవి మరింతగా క్షీణించే అవకాశాలూ కనిపిస్తున్నాయి. 50 శాతం టారిఫ్‌ల ప్రభావం ఉండనున్నది. దీంతో ఈ నెలాఖర్లో ఇరు దేశాల మధ్య జరిగే ఆరో విడుత వాణిజ్య చర్చలకు ప్రాధాన్యం ఏర్పడుతున్నది. చర్చలు ఫలిస్తే సుంకాల భారం తగ్గే అవకాశాలున్నాయి.

# ఏటీఎంలలో పెరుగుతున్న చిన్న నోట్లు

హైదరాబాద్, ఆగస్టు : ఏటీఎంలలో రూ.500 నోట్లతోపాటు చిన్న నోట్లు (రూ.200, రూ.100 నోట్లు) కూడా ఎక్కువగా అందుబాటులో ఉంటున్నాయి. రూ.500 నోట్లను రద్దు చేస్తున్నట్టు ఇటీవల మీడియా, సోషల్ మీడియాల్లో వార్తలు చక్కర్లు కొట్టిన నేపథ్యంలో ఇది ప్రాధాన్యంగా మారింది. నిజానికి ఈ అంశంపై ఇటీవలే కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో వివరణ ఇచ్చిన విషయం తెలిసిందే. రూ.500 నోట్లను రద్దుచేసే యోచనదీ లేదని.. అయినప్పటికీ ఏటీఎంల ద్వారా చిన్న నోట్ల చలామణిని పెంచుతున్నట్టు ఈ సందర్భంగా మంత్రి తెలిపారు.ప్రజల అవసరాల దృష్ట్యానే ఇదంతా అని వివరించారు. కాగా, ఈ ఏడాది సెప్టెంబర్ 30నాటికి కనీసం 75 శాతం ఏటీఎంలు, వచ్చే ఏడాది మార్చి 31కల్లా 90 శాతం బ్యాంకుల్లో తప్పనిసరిగా రూ.100, రూ.200 నోట్లు కూడా అందుబాటులో ఉంచాలని ఇటీవల రిజర్వ్ బ్యాంక్ ఆఫ్



ఇండియా (ఆర్బీఐ) అన్ని బ్యాంకులకు ఆదేశాలు జారీ చేసింది.

# స్థిరంగా బంగారం ధర ఈ రోజు మీ నగరంలో బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే

భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గు చూపుతుండడంతో బంగారం ధరలు ఇటీవల ఆల్‌టైమ్ గరిష్టానికి చేరువ అయ్యాయి . అయితే ప్రస్తుతం మళ్లీ క్రమంగా కిందికి దిగివస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ రోజు (ఆగస్ట్ 15న) 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 1, 01, 340కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 92, 890కి చేరింది. నిన్నటితో పోల్చుకుంటే బంగారం ధరల్లో మార్పు లేదు.ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 1, 01, 490కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 93, 040కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1, 01, 340కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 92, 890కి చేరింది. వెండి



ధరలు నిన్నటితో పోల్చుకుంటే వంద రూపాయల మేర పెరిగాయి. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు తెలుసుకుందాం.

# భారత్ రేటింగ్ పెంపు

న్యూఢిల్లీ: భారత్ మృత ఆర్థిక వ్యవస్థ అని నోరు పారేసుకున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఆ దేశానికే చెందిన ప్రముఖ అంతర్జాతీయ పరపతి రేటింగ్ సంస్థ 'ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్' గట్టి సమాధానం ఇచ్చింది. దీర్ఘకాలిక దృష్టితో చూస్తే భారత ఆర్థిక వ్యవస్థ పునాదులు చాలా పటిష్ఠంగా ఉన్నట్టు తెలిపింది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని భారత దేశ సార్వభౌమ పరపతి రేటింగ్‌ను 'బీబీబీ మైనస్' స్థాయి నుంచి 'బీబీబీ' స్థాయికి పెంచుతున్నట్టు ప్రకటించింది. గత 18 సంవత్సరాల్లో ఈ సంస్థ మన దేశ పరపతి రేటింగ్‌ను పెంచడం ఇదే మొదటిసారి. ట్రంప్ సుంకాల పోటు ఉన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ స్థిరంగా, హుషారుగా ఉన్నట్టు తెలిపింది. ఈ పరపతి రేటింగ్ పెంపుతో కేంద్ర ప్రభుత్వం, ప్రైవేటు కంపెనీలు తక్కువ వడ్డీకే విదేశాల నుంచి రుణాలు, నిధులు సమీకరించగలుగుతాయని భావిస్తున్నారు.




వృద్ధికి ఢోకా లేదుట్రంప్ సుంకాల కత్తి వేలాడుతున్నా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత జీడీపీ వృద్ధి రేటుకు ఎలా ంటి ఢోకా ఉండదని ఎస్ అండ్ పీ గ్లోబల్ అంచనా. గత ఆర్థిక సంవత్సరంలోలానే ఈ ఆర్థిక సంవత్సరం కూడా భారత ఆర్థిక వ్యవస్థ 6.5 శాతం వృద్ధి రేటు నమోదు చేస్తుందని తెలి పింది. తగ్గుతున్న వడ్డీ రేట్లు, ద్రవ్యోల్బణం ఇందుకు దోహదం చేస్తాయని పేర్కొంది. పెట్టుబడులకుజిఊతం! పరపతి రేటింగ్ పెంపు విదేశాల నుంచి మన దేశం మరిన్ని పెట్టుబడులు ఆకర్షించేందుకూ దోహదం చేయనుంది. ఈ రేటింగ్ పెంపుతో మన దేశ మధ్య, దీర్ఘకాలిక అవకాశాలపై దేశ, విదేశీ పెట్టుబడిదారులకు మరింత నమ్మకం ఏర్పడనుంది. దీంతో ఎఫ్‌పీఐలతో పాటు విదేశీ కంపెనీలూ మన దేశంలో మరిన్ని పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తాయని భావిస్తు న్నారు. ట్రంప్ సుంకాలతో అనిశ్చితిలో పడిన భారత ఆర్థిక వ్యవస్థకు ఈ పరపతి రేటింగ్ పెంపు పెద్ద ఊరట అని మద్రాస్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ డైరెక్టర్ ఎన్ఆర్ భానుమూర్తి చెప్పారు. ఈ రేటింగ్స్ ప్రభావం ఫారెక్స్ మార్కెట్లో రూపాయి మారకం రేటు స్థిరపడేందుకూ దోహదం చేస్తుందని ఆర్థిక నిపుణుల అంచనా.అమెరికా రేటింగ్ మాత్రం కిందికి..తాజాగా ట్రంప్ సుంకాల పోటు, అర్థంపర్థం లేని ఆర్థిక విధానాలతో అమెరికా ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి వెళ్లే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# వార్ 2' రివ్యూ ఎన్టీఆర్, హృతిక్ రోషన్‌ల స్పై యాక్షన్ ఎలా ఉందంటే

సినిమా పేరు: వార్ 2తారాగణం: హృతిక్ రోషన్, ఎన్టీఆర్, కియారా అద్వానీ, అనిల్ కపూర్, అశుతోష్ రాణా, అలియాభట్, బాబీ దేవోల్, శర్వారీ వాఘ్ తదితరులుదర్శకత్వం: అయాన్ ముఖర్జీసంగీతం: ప్రీతం చక్రవర్తి, సంచిత్ బల్హారా, అంకిత్ బల్హారా.నిర్మాత: ఆదిత్య చోప్రానిర్మాణం: యష్‌రాజ్ ఫిలిమ్స్విడుదల తేదీ : ఆగష్టు 14కెమెరా: బెంజమిన్ జాస్పర్ఎన్టీఆర్ తొలిసారి బాలీవుడ్‌లో నటించిన సినిమా 'వార్ 2'. రాజమౌళి 'ఆర్ఆర్ఆర్' తర్వాత దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నారు తారక్. దాంతో బాలీవుడ్ దర్శకుల దృష్టి తారక్‌పై పడింది. అందులో భాగంగా వచ్చిన అవకాశమే ఈ 'వార్ 2'. పైగా 'ఆర్ఆర్ఆర్' తర్వాత తారక్ నటించిన భారీ మల్టీస్టారర్ ఈ సినిమా. ఇందులో ఆయన హృతిక్ రోషన్‌తో కలిసి నటించారు. యష్‌రాజ్ ఫిల్మ్స్ స్పై యూనియర్స్‌లో ఇప్పటివరకూ వచ్చిన సినిమాలన్నీ విజయాలను అందుకున్నాయి. ఈ క్రమంలో వచ్చిన అదే సంస్థ నుంచి వచ్చిన మరో పానిండియా ప్రయత్నం ఈ 'వార్2'. నిర్మాణంలో ఉన్నప్పుడే ఈ సినిమాపై ఎన్నో అంచనాలేర్పాయి. ఎట్టకేలకు గురువారం ఈ సినిమా విడుదలైంది. మరి అందరి అంచనాలనూ 'వార్ 2' నిజం చేసిందా? యష్‌రాజ్ స్పై యూనియర్స్‌లో మరో విజయం చేరినట్టేనా? ఈ ప్రశ్నలకు సమాధానమే మిగతా కథ.కథఃఇండియన్ రా ఏజెన్సీలో ప్రముఖుడైన ఏజెంట్ కబీర్(హృతిక్) కిరాయి హంతకుడిగా మారి హత్యలు చేస్తుంటాడు. ఇదిలావుంటే.. చైనా, రష్యా, శ్రీలంక, మయన్మార్, బంగ్లాదేశ్ దేశాలన్నీ ఒక కోటరీగా మారి, 'కలి' పేరుతో ఇండియా పతానానికి ప్లాన్ చేస్తాయి. ఈ మిషన్‌ని కబీర్‌కు అప్పజెబుతాయి. కబీర్‌ను అడ్డుకునేందుకు విక్రమ్ చలపతి(జూనియర్ ఎన్టీఆర్) రంగంలోకి దిగుతాడు. అసలు కబీర్‌కీ, విక్రమ్‌కు మధ్య ఉన్న బంధం ఏంటి? 'కలి' వల్ల భారత ప్రధానికి పొంచివున్న ముప్పును వీరిద్దరూ ఎలా ఆపారు? ఈ మిషన్‌లో వింగ్ కమాండర్ కావ్య లూత్ర(కియారా అద్వానీ) పాత్ర ఏంటి? ఈ ప్రశ్నలకు సమాధానమే మిగతా కథవిశ్లేషణఃగతంలో వచ్చిన యష్‌రాజ్ స్పై థ్రిల్లర్స్ మాదిరిగానే ఇది కూడా సాగింది.



టామ్ అండ్ జెర్రీని తలపించే కబీర్, విక్రమ్‌ల పోరాటం, ఎత్తుకు పైఎత్తులు ఆడియన్స్‌ని అలరియస్తాయి. ఓ క్రేజీ యాక్షన్ ట్రీట్ ఈ సినిమా. ఒకదాన్ని మించి ఒకటిగా ఇందులో యాక్షన్ సీక్వెన్స్ దర్శకుడు అయాన్ ముఖర్జీ డిజైన్ చేశారు. అలాగే కథలోని ట్విస్టులు, టర్నింగ్‌లు మంచి సర్‌ప్రైజ్‌ని ఇస్తాయి. డిఫరెంట్ మైండ్ సెట్‌తో, అందుకు తగ్గట్టు విభిన్నమైన బాడీ లాంగ్వేజ్‌తో హృతిక్, తారక్ అదరగొట్టేశారు. కథ పాతదే అయినా.. కథనంలో ఆకట్టుకున్నారు దర్శకుడు అయాన్ ముఖర్జీ. అయితే.. స్టాంగ్ ఎమోషన్స్ లేకపోవడం ఈ కథలో పెద్ద మైనస్. కథలో దేశభక్తి ఉంది కానీ.. యాక్షన్ గోలలో పడి దాన్ని సరిగ్గా ఆవిష్కరించలేదేమో అనిపిస్తుంది. హీరోలిద్దరూ మధ్య గొడవకు దోహదపడ్డ పరిస్థితులు కాస్త బలంగా ఉంటే దాని వల్ల వచ్చే ఇంపాక్ట్ కూడా బావుంది. కానీ ఈ సినిమాలో అదే లోపించింది. సెకండాఫ్ కాస్త డల్‌గా అనిపిస్తుంది.నటీనటులుఃముఖ్యంగా తారక్ నటన, యాటిట్యూడ్ ఫ్యాన్స్‌కు మంచి విందు బోజనమే. ఇక హృతిక్ అయితే.. తన మార్క్ ప్రజెన్స్‌తో కట్టిపడేశాడు. 'వార్ 1'ను మించి ప్లాన్ చేస్తాయి. ఈ మిషన్‌ని కబీర్‌కు అలరించారాయన. ఇక యాక్షన్ పార్ట్‌లో అయితే.. ఆయన అలవోకగా చేసిన ఫైట్స్ సినిమాకే హైలైట్. అనిల్ కపూర్, అశుతోష్ రాణా ఎప్పటిలాగే అద్భుతంగా నటించారు. కియారా అద్వానీది ఇందులో లిమిటెడ్ రోల్. ఉన్నంతలో బాగానే చేసింది.టెక్నికల్‌గాఃఇద్దరూ స్టార్ హీరోలను పెట్టి సినిమాను తీసినందుకు ముందుగా దర్శకుడు అయాన్ ముఖర్జీని మెచ్చుకోవాలి. ఒకరిని తక్కువ కాకుండా ఒకరిని ఎక్కువ కాకుండా హృతిక్‌ని, ఎన్టీఆర్‌ని బ్యాలెన్స్‌డ్‌గా అయాన్ చూపించిన విధానం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇక ఆదిత్య చోప్రా రాసిన కథ బాగున్నా, అతడి పాత యాక్షన్ సినిమాలను ఇది గుర్తు చేస్తుంది. శ్రీధర్ రాఘవన్ స్క్రీన్‌ప్లే ప్రేక్షకులను మెప్పిస్తుంది. బెంజమన్ జాస్పర్ సినిమాటోగ్రఫీ ఆకట్టుకుంటుంది. యాక్షన్ సన్నివేశాలను అత్యంత సహజంగా చిత్రీకరించారు. ప్రీతమ్ అందించిన పాటలు బాగున్నాయి. సంచిత్, అంకిత్ ద్వయం సమకూర్చిన నేపథ్య సంగీతం సినిమాపై బలమైన ప్రభావాన్ని చూపించింది. సినిమా నిర్మాణం ఉన్నతంగా ఉంది. విజువల్ ఎఫెక్ట్స్ విషయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకుని ఉంటే బాగుండేది. ముఖ్యంగా విరామానికి ముందు ప్రైవేట్ జెట్‌లో వచ్చే సన్నివేశాలు కొంత అతిశయంగా అనిపిస్తాయి. మొత్తానికి, 'వార్ 2' ఒక యాక్షన్ థ్రిల్లర్‌గా ఎన్టీఆర్, హృతిక్ అభిమానులను, యాక్షన్ ప్రియులను అలరించేలా ఉంది.బలాలుఃహృతిక్, తారక్ నటన, యాక్షన్ ఎపిసోడ్స్, నేపథ్య సంగీతం..బలహీనతలుఃకథ, కొన్ని పేలవమైన సన్నివేశాలు..రేటింగ్ : 3/5

# ఆ హీరోయిన్‌ని దారుణంగా విమర్శించిన మృణాల్ కౌంటర్ ఇచ్చిన బిపాసా



తెలుగు ప్రేక్షకుల మదిలో సీతా మహాలక్ష్మిగా నిలిచిన మృణాల్ ఠాకూర్, ఇటీవల సినిమాల కంటే ఎక్కువగా వ్యక్తిగత విషయాలతో హాట్ టాపిక్ అవుతున్నారు.అక్కినేని సుమంత్‌తో పెళ్లి అంటూ వచ్చిన గాసిప్స్‌కి, ధనుష్‌తో డేటింగ్ అంటూ బాలీవుడ్‌లో చక్కర్లు కొట్టిన వార్తలకు క్లారిటీ వచ్చినట్లు కనిపించినా%@% తాజాగా ఆమె పాత వీడియో ఒకటి వెలుగులోకి వచ్చి మళ్లీ చర్చనీయాంశంగా మారింది. "బిపాసా కంటే నేనే అందంగా ఉంటాను" అంటూ చేసిన కామెంట్స్ వైరల్ అయ్యాయి. మృణాల్ టీవీ సీరియల్స్‌లో నటిస్తూ కెరీర్ ప్రారంభించిన కాలంలో ఆమె ఓ ఇంటర్వ్యూలో బిపాసా బసుపై కాస్త ఘాటు వ్యాఖ్యలు చేసింది.ఎవరైనా కండలు తిరిగిన అమ్మాయిని పెళ్లి చేసుకోవాలనుకుంటే%@% బిపాసాను చేసుకోండి! నేను బిపాసా కంటే బెటర్‌గా ఉంటాను. ఆడవాళ్లు తనలా నాజుగ్గా ఉండాలని.. బిపాషా మాదిరి కండలు తిరిగిన వారిలా ఉండకూడదని.. ఆమెను చూస్తే మగవారిలా అనిపిస్తుందని మృణాల్ కామెంట్ చేసింది. ఇప్పుడు ఈ కామెంట్స్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. ఇది చాలా పాతదే అయినా ఇప్పుడు తెరపైకి వచ్చింది.ఈ వీడియో వైరల్ అవుతున్న నేపథ్యంలో బిపాసా బసు తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో ఓ మోటివేషనల్ కోట్ షేర్ చేశారు. బలమైన స్త్రీలు ఒకరికొకరు మద్దతుగా నిలబడాలి.మహిళలు బలంగా కనిపించడం తప్పు కాదు.శారీరక, మానసిక బలం కోసం కండలు అవసరం. పాతకాలపు ఆలోచనలు మార్చండి అనే కొటేషన్ పెట్టింది. నెటిజన్ల అభిప్రాయం ప్రకారం, ఇది మృణాల్ వ్యాఖ్యలకు కౌంటర్ లా ఉందని భావిస్తున్నారు.బిపాసా, ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రోనాల్డోతో కలిసి ఉన్న వీడియోను కూడా అదే సమయంలో షేర్ చేయడం గమనార్హం. ఇది చూసిన కొంతమంది అభిమానులు.. "తన స్థాయిని చూపించేందుకే ఈ వీడియో పెట్టిందా?" అంటూ కామెంట్స్ చేస్తున్నారు. అయితే సోషల్ మీడియాలో ఈ విషయంపై ట్రోల్ నడుస్తున్న క్రమంలో మృణాల్ స్పందించింది. 19 ఏళ్ల వయస్సులో సిల్లీ విషయాల గురించి మాట్లాడాను. అప్పుడు అవి ఎంత బాధిస్తాయో తెలియదు. మెచ్యూరిటీ లేదు.మనస్ఫూర్తిగా క్షమాపణలు చెబుతున్నా. ఒకరిని బాధించడం, ఒకరిని ఇబ్బంది పెట్టాలనేది నా ఇంటెన్షన్ కాదు. ఫ్రెండ్స్‌తో చిట్ చాట్ విషయంలో కాస్త హద్దులు దాటి ఇలాజరిగింది. క్షమించండి మృణాల్ పేర్కొంది.

# 'కూలీ' రివ్యూ.. రజనీకాంత్ మాస్ యాక్షన్ అలరించిందా

సినిమా పేరు: కూలీ తారాగణం: రజనీకాంత్, నాగార్జున, అమీర్‌ఖాన్, ఉపేంద్ర, సత్యరాజ్, శ్రుతీ హాసన్..దర్శకత్వం: లోకేష్ కనకరాజ్ సంగీతం: అనిరుధ్ రవిచందర్ నిర్మాత: కళానిధి మారన్నిర్మాణం: సన్ పిక్చర్స్రజనీకాంత్ సినిమా అంటే హైప్ సర్వసాధారణం. దానికి తోడు 'కూలీ' సినిమాలో విలన్‌గా చేసింది నాగార్జున. వీరిద్దరితోపాటు అమీంఖాన్, ఉపేంద్ర స్పెషల్ ఎట్రాక్షన్. ఇక తలైవా సినిమా అంటే అనిరుథ్ ఏ రేంజ్‌లో రెచ్చిపోతాడో తెలిసిందే. ముఖ్యంగా బ్లాక్‌బస్టర్స్ ఖైదీ, విక్రమ్, లియోల తర్వాత లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో వచ్చిన సినిమా. అన్నింటినీ మించి రజనీకాంత్‌ని లోకేష్ కనకరాజ్ డైరెక్ట్ చేసిన తొలి సినిమా. ఈ కారణాలు చాలవా 'కూలీ'పై అంచనాలు ఆకాశంలో ఉండటానికి!? ప్రేక్షకులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న 'కూలీ' ఈ గురువారం థియేటర్లలోకి అడుగుపెట్టాడు. మరి అందరి అంచనాలనూ 'కూలీ' నిజం చేశాడా? తలైవా ఖాతాలో హిట్ పడినట్టేనా? లోకేష్ కనకరాజ్ విజయయాత్ర కొనసాగుతున్నట్టేనా? ఈ ప్రశ్నలకు సమాధానం కావాలంటే ముందు కథలోకి వెళ్లాలికథఃసైమన్(అక్కినేని నాగార్జున) పేరు మోసిన స్మగ్లర్. ఓ షిప్‌యార్డ్‌ని అడ్డాగా చేసుకొని తన కార్యకలాపాలు కొనసాగిస్తుంటాడు. స్మగ్లిగూడ్స్, బంగారం ఇల్లీగల్‌గా ఎగుమతీ, దిగుమతులు అతని వృత్తి. అతని అనుంగు అనుచరుడు దయాళ్(సౌబిన్ షాహిర్). సైమన్ ఇల్లీగల్ యాక్టివిటీస్ అన్నీ ఇతని కనుసన్నల్లోనే జరుగుతుంటాయి. మహాక్రూరుడు. ఇదిలావుంటే.. మరణించిన జంతువుల క్రిమేషన్ కోసం రాజశేఖర్(సత్యరాజ్) ఓ ఎలక్ట్రిక్ ఛైర్‌ని తయారు చేస్తాడు. ఇలాంటి ఛైర్ కారణంగా మంచితోపాటు చెడు కూడా జరిగే అవకాశం ఉందంటూ ప్రభుత్వ ప్రతినిధులు అభిప్రాయపడతారు. దాంతో ఆ ఛైర్‌ని మార్కెట్‌లోకి తెచ్చేందుకు గవర్నమెంట్ పర్మిషన్ రాదు. తన శ్రమంతా వృధా అయిపోతుందనుకొని రాజశేఖర్ బాధ పడుతున్న సమయంలో అతనికి సైమన్ నుంచి కబురు వస్తుంది. తాను చంపిన శవాలను బూడిద చేసేందుకు ఆ ఛైర్ కావాలంటాడు సైమన్. సహకరించపోతే కూతుళ్లను చంపుతానని బెదిరిస్తాడు. దాంతో కుటుంబం కోసం తప్పక సైమన్‌తో చేయి కలుపుతాడు రాజశేఖర్. సైమన్ చంపిన శవాలను ఆ కుర్చీ సహాయంతో బూడిద చేస్తుంటాడు. తన కుమార్తె ప్రీతి(శ్రుతిహాసన్) రాజశేఖర్‌కు ఈ విషయంలో సహాయం చేస్తుంటుంది. ఇదిలావుంటే.. ఉన్నట్టుండి రాజశేఖర్ మరణిస్తాడు. ఆ మరణవార్త విన్న రాజశేఖర్ ప్రాణస్నేహితుడు దేవా(రజనీకాంత్) షాక్ అవుతాడు. రాజశేఖర్‌ది సహజ మరణం కాదని, అతన్ని కొట్టి చంపారని దేవాకు తెలుస్తుంది. అంతేకాక, రాజశేఖర్ కుమార్తెలు ముగ్గురూ కూడా ప్రమాదంలో ఉన్నారని దేవాకు తెలుస్తుంది. దాంతో తన స్నేహితుడి పిల్లలకు దేవా అండగా నిలుస్తాడు. అసలు రాజశేఖర్‌ని చంపిందెవరు? రాజశేఖర్ పిల్లల్ని దేవా ఎలా కాపాడాడు? అసలు ఈ దేవా ఎవరు? ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానమే మిగతా కథ.విశ్లేషణఃఒక సాధారణ కథా వస్తువుకు, చక్కని కథనాన్ని జోడించి, జనరంజకంగా చెప్పడానికి ప్రయత్నించాడు దర్శకుడు లోకేష్ కనకరాజ్. ప్రథమార్థం ఆడియన్స్ ముందు కొన్ని ప్రశ్నలుంచి, ద్వితీయార్థంలో ఆ చిక్కుముళ్లను ఒక్కొక్కటిగా విప్పుకుంటూ సినిమాను ముగించాడు. ఆ చిక్కుముళ్లను ఆసక్తికరంగా విప్పితే సినిమా హిట్. ఈ విషయంలో కొంతవరకూ మాత్రమే విజయం సాధించాడు లోకేష్ కనకరాజ్. అసలు రాజశేఖర్, దేవా ఎలా ఫ్రెండ్స్ అయ్యారు? వాళ్లిద్దరూ ఎలా విడిపోయారు? 30ఏండ్ల తర్వాత రాజశేఖర్ జీవితంలోకి దేవా రావడానికి గల కారణాలేంటి? ఇవన్నీ ఈ కథలో ఆసక్తికరమైన విషయాలు. రజనీకాంత్ క్యారెక్టరైజేషన్ నెక్ట్స్‌లెవల్లో డిజైన్ చేశారు లోకేష్. తనది కాని సమస్యలోకి ఎంటరై,



ప్రమాదాలతో ఆడుకుంటూ.. రాజశేఖర్ (సత్యరాజ్) కుమార్తెలను కాపాడుకుంటూ వెళ్తున్న దేవాను మనం ఫస్టాఫ్‌లో చూస్తాం. సెంకాడాఫ్‌కు వచ్చే సరికి అసలది తన సమస్యే అని తెలుస్తుంది. అదేంటనేది ఈ కథలో కీ పాయింట్. అయితే.. సినిమాలోని కొన్ని సన్నివేశాలు కృతకంగా అనిపిస్తాయి. మొత్తం సినిమా అయితే ఆకట్టుకునేలాగే ఉంది.నటీనటులుఃదేవాగా రజనీకాంత్ నటనకు అభిమానులు ఉర్రూతలూగిపోవడం ఖాయం. పవర్‌ఫుల్ యాక్షన్ ఎలిమెంట్స్‌తో మరోవైపు ఎమోషన్స్‌తో అదరగొట్టేశారు సూపర్‌స్టార్. ముఖ్యంగా ఫ్లాష్‌బ్యాక్ యాక్షన్ సీక్వెన్స్‌లో వింటేజ్ తలైవాను చూసి తమిళ జనం ఊగిపోవడం ఖాయం. ఇక విలన్ సైమన్‌గా నాగార్జున ఆకట్టుకున్నారు. ఆయన లుక్ కూడా ట్కస్టైలిష్‌గా బావుంది. తొలిసారి ప్రతినాయకుడిగా కనిపించిన నాగ్.. ఎలా చేస్తారా? అని అందరూ అనుకుంటున్న సమయంలో ఓ కొత్త విలనిజాన్ని సిల్వర్‌స్క్రీన్‌కి ప్రజెంట్ చేశారు నాగ్. ఇక అతిథి పాత్రల్లో కనిపించిన ఉపేంద్ర, ఆమిర్‌ఖాన్‌లు కూడా సినిమాకు ప్లస్ అయ్యారు. ఈ సినిమా కీలకమైన పాత్ర సౌజిన్ షాహిర్‌ది. నిజంగా తను అద్భుతంగా నటించారు. ఇక శ్రుతిహాసన్ ఇందులో చాలా ఇంపార్టెంట్ రోల్ చేశారు. సత్యరాజ్ కూడా ఉన్నంతలో మెరిపించారు. పూజా హెగ్డే స్పెషల్ సాంగ్ సినిమాకు ఓ ఆకర్షణ.టెక్నికల్‌గాఃఈ సినిమాకు కథనం ప్రధాన బలం. కథ విషయంలో ఇంకాస్త జాగ్రత్త పడితే బావుండేది అనిపించింది. మొత్తంగా దర్శకుడు లోకేష్ కనకరాజ్ సినిమాను జనం మెచ్చేలాగే తీశారు. ఇక అనిరుథ్ సంగీతం అదరహో అనిపించింది. కెమెరా వర్క్ కూడా చాలా బావుంది. సన్ పిక్చర్స్ ప్రొడక్షన్ వ్యాల్యూస్ అడుగడుగునా కనిపించింది. మొత్తంగా మాస్ సినిమాలను ఇష్టపడేవాళ్లకు, ముఖ్యంగా రజనీకాంత్ అభిమానులకు 'కూలీ' నచ్చుతుంది.బలాలుఃరజనీకాంత్, నాగార్జున నటన, స్క్రీన్‌ప్లే, అనిరుథ్ సంగీతం..మైనస్‌లుఃకథ, నాటకీయంగా అనిపించే కొన్ని సన్నివేశాలు రేటింగ్ : 3/5

# అఖండ 2లో శివసాక్షాత్కారం

అగ్ర నటుడు బాలకృష్ణ కెరీర్‌లో 'అఖండ' సినిమా ఓ అద్భుతం. కోవిడ్ కారణంగా వెలవెలబోతున్న సినిమా థియేటర్లకు మళ్లీ జనకళను తెచ్చిన సినిమా అది. అందుకే.. బాలకృష్ణకు అభిమానులున్నట్టే.. 'అఖండ' సినిమాకు కూడా ప్రత్యేకంగా అభిమానులున్నారు. వచ్చే నెల 25న ఆ సినిమాకు సీక్వెల్‌గా 'అఖండ 2 –తాండవం' రానుంది. ఈ సినిమాపై అంచనాలు సాధారణంగా లేవ్. రీసెంట్‌గా విడుదలైన టీజర్ కూడా రికార్డు స్థాయి వ్యూస్‌ని సాధించింది. 'అఖండ 2' గురించి ఎలాంటి అప్‌డేట్ విడుదలైనా.. అది క్షణాల్లో వైరల్ అయిపోతున్నది. 'అఖండ 2' ప్రభావం ఆడియన్స్‌లో అలా ఉంది. తాజా ఈ సినిమాకు సంబంధించిన తాజా సమాచారం వెలుగు చూసింది.'అఖండ' సినిమా విజయానికి ప్రధాన కారణం అమ్మ సెంటిమెంట్. దాన్ని సీక్వెల్‌లో మరింత గొప్పగా ఆవిష్కరించనున్నారట దర్శకుడు బోయపాటి శ్రీను. ఆ ఎపిసోడ్స్ కూడా చాలా బాగా వచ్చినట్టు



చిత్రయూనిట్ చెబుతున్నది. వీటితోపాటు యాక్షన్ సీన్స్ కూడా 'అఖండ'ను మించే ఉంటాయట.ఇక అఖండ సికిందర్ అఘోరీగా ఇందులో బాలకృష్ణ మరోసారి నట విశ్వరూపం చూపించనున్నారని, 'అఖండ'ను మించి అత్యంత శక్తిమంతంగా ఇందులో ఆయన పాత్ర ఉంటుందని, సాక్షాత్ శివుడ్నే ఆ పాత్రలో జనం చూస్తారని మేకర్స్ చెబుతున్నారు. రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఆది, పగ్య జైస్వాల్, సంయుక్త మీనన్ కీలక పాత్రధారులు. తమన్ సంగీతం అందిస్తున్న విషయం విదితమే.

# స్పిరిట్ షూటింగ్ అప్డేట్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ క్రేజ్ గురించి తెలిసిందే. ఆయన నటించే సినిమాల కోసం ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా వెయిట్ చేస్తుంటారు. బాహుబలి సినిమాతో ప్రపంచవ్యాప్తంగా స్టార్‌డమ్ సంపాదించుకున్న డార్లింగ్.. ఇప్పుడు చేతినిండా సినిమాలతో ఫుల్ బిజీగా ఉంటున్నారు. ప్రస్తుతం డైరెక్టర్ మారుతి దర్శకత్వంలో రాజాసాబ్ చిత్రంలో నటిస్తున్న డార్లింగ్.. అలాగే డైరెక్టర్ హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న ఫౌజీ (ప్రచారంలో ఉన్న టైటిల్)లో నటిస్తున్నారు. ఈ రెండు సినిమాలపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇవే కాకుండా డార్లింగ్ ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా వెయిట్ చేస్తున్న సినిమా స్పిరిట్. యానిమల్ సినిమాతో సంచలనం సృష్టించిన డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తోన్న ఈ సినిమాపై భారీ హైప్ నెలకొంది.ప్రభాస్, సందీప్ రెడ్డి వంగా కాంబోలో రాబోతున్న ఈ సినిమా కోసం ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా వెయిట్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా ఈ సినిమాకు



సంబంధించిన క్రేజీ అప్డేట్ బయటకు వచ్చింది. సెప్టెంబర్ నెలాఖరున ఈ మూవీ పూజా కార్యక్రమాలతో సెట్స్ మీదకు వెళ్లనుందని సమాచారం. ఇందులో ప్రభాస్ సరసన బాలీవుడ్ బ్యూటీ త్రిప్తి దిమ్రి నటించనున్నట్లు ఇదివరకే మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రాన్ని భూషణ్ కుమార్, క్రిషన్ కుమార్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

# ఇండస్ట్రీలో ఎవరి కుంపటి వారిదే



సైమా' బృందం నిర్వహించిన కార్యక్రమంలో నిర్మాత అల్లు అరవింద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలుగు చలన చిత్ర పరిశ్రమలో ఎవరి కుంపటి వారిదేనన్నారని అన్నారు. జాతీయ అవార్డులకు ఎంపికైన వారిని సత్కరించకపోవడంపై అయన మాట్లాడుతూ "ఈ ఏడాది జాతీయ పురస్కారాల్లో తెలుగు సినిమాలకు ఏడు అవార్డులొచ్చాయి. 'సైమా' స్పందించి, జాతీయ అవార్డు విజేతలను సత్కరించడం అభినందనీయం. తెలుగు సినిమాకు ఇన్ని అవార్డులు వచ్చినా మన పరిశ్రమ స్పందించలేదు. జాతీయ అవార్డులను ఒక పండుగగా నిర్వహించుకోవాలి. ఇక్కడ అలా జరగడం లేదు. ఇండస్ట్రీలో ఎవరి కుంపటి వారిదే. అందుకే ఎలాంటి మంచి పనులు చేయలేకపోతున్నాం' ని అన్నారు.

Editor, printer, published Owned by CHINTHALA RAMAKRISHNA Gummadidala (M&V) SANGAREDDY DIST TELANGANA State 502313 ph 8499902850/RNI NO:TELTEL/2022/81794